'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 81 | గురువారం | 5.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 81 | Thursday | 5.11.2026 | Pages: 8 | Rate: 2



అమెరికా ఎన్నికల దెబ్బ

ట్రంప్‌కు రాజకీయ ఒత్తిడి

భారత్‌కు కొత్త అవకాశాలు

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌ను కైవసం చేసుకోవడం భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపనుంది. కాంగ్రెస్‌పై పట్టు కోల్పోయిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయంగా తన బలాన్ని నిరూపించుకోవడానికి భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా ముగించాలని ప్రయత్నించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

- వివరాలు 3లో...



అమెరికా మిడ్‌టర్మ్ దెబ్బ

ఖమేనీకి రాజకీయ అస్త్రం!

వాషింగ్టన్‌లో ట్రంప్‌కు పరాజయం

ఫలితాలతో ఇరాన్‌లో విజయోత్సాహం

యుద్ధమే కొంపముంచిందన్న వాన్స్

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురైన ఎదురుదెబ్బను ఇరాన్ తన విజయంగా అభివర్ణిస్తోంది. డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ ఆధిపత్యం సాధించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజకీయంగా గట్టి దెబ్బ తగిలిందని ఇరాన్ భద్రతా విభాగం అధిపతి మొహ్సేన్ రెజాయ్ వ్యాఖ్యానించారు.

- వివరాలు 3లో...



మస్క్‌కు మిడ్‌టర్మ్ షాక్

రూ.4,700 కోట్ల పెట్టుబడి బూడిదేనా?

మస్క్ వ్యాపారాలపై డెమొక్రాట్ల గురి !

అమెరికా రాజకీయాల్లో అత్యంత ప్రభావశీల బిలియనీర్‌గా ఎదిగిన ఎలాన్ మస్క్‌కు మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. రిపబ్లికన్ అభ్యర్థుల విజయానికి ఆయన దాదాపు రూ.4,700 కోట్లు ఖర్చు చేసినట్లు కథనం వెల్లడించింది.

- వివరాలు 3లో...



కృష్ణుడి వారసులం.. ఎవరికీ భయపడం!

లాలూ పోరాటం.. మా రక్తంలోనే ధైర్యం

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తేజస్వి యాదవ్ ఫైర్

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఆర్జేడీ నేత, బీహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన యాదవుల సదర్ ఉత్సవంలో పాల్గొన్న ఆయన, తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలతో వేధించారని ఆరోపించారు.

- వివరాలు 2లో...



త్రిశంకు స్వర్గంలో ట్రంప్

మిడ్ టర్మ్ పోల్ రిజల్ట్

ప్రెసిడెంట్ టోటల్‌గా అప్సెట్

రెండేళ్లకే అమెరికా జనం వెక్స్

అధికార పార్టీని సాగనంపేందుకు ఫిక్స్

అధ్యక్షుడితో అమీతుమీకి డెమోక్రట్స్ రెడీ

వైట్ హౌస్‌లో మొదలైన అలజడి

అమెరికాను శాసిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సొంత దేశంలోనే రాజకీయ సవాల్ ఎదురైంది. నాలుగేళ్ల కోసం అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్న ఆయనకు రెండేళ్లు తిరగకముందే ప్రజలు మరో సంకేతం పంపించారు. అధ్యక్షుడిగా ట్రంప్ కొనసాగుతారు.. కానీ ఆయన చెప్పిన ప్రతిదానికీ కాంగ్రెస్ తలూపే పరిస్థితి మాత్రం మారిపోయింది. 435 మంది ప్రతినిధుల సభ సభ్యులు, 100 మంది సెనెటర్లతో కూడిన అమెరికా కాంగ్రెస్‌లో డెమొక్రాట్లు పట్టు సాధించడంతో వైట్‌హౌస్‌లో రిపబ్లికన్ అధ్యక్షుడు.. చట్టసభల్లో ప్రతిపక్షం అనే కొత్త రాజకీయ సమీకరణం తెరపైకి వచ్చింది. ఇక ట్రంప్ తీసుకొచ్చే బిల్లులకు ఆమోదం లభిస్తుందా? బడ్జెట్‌కు నిధులు దొరుకుతాయా? ఇరాన్‌పై యుద్ధ వ్యూహాలు కొనసాగుతాయా? ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రజల తీర్పును మార్చాయా? ట్రంప్‌ను అభిశంసించే దిశగా డెమొక్రాట్లు అడుగులు వేస్తారా? భారత్‌తో అమెరికా సంబంధాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ప్రపంచ దేశాలు ఇప్పుడు అమెరికా వైపు ఎందుకు చూస్తున్నాయి? అధ్యక్ష పీఠం ట్రంప్‌దే.. కానీ పాలన సాగించేందుకు అవసరమైన రాజకీయ బలం మారిపోయింది! రాబోయే రెండేళ్లు అమెరికా రాజకీయాలను ఏ మలుపు తిప్పనున్నాయి?

- వివరాలు 7లో...

ఆర్టీఐ సమాచారం.. అప్లై చేస్తే గ్రహాచారం

సమాచార కమిషన్ సన్నాయి నొక్కులు

సమాచారం కోరితే తప్పని తిప్పలు

కమీషనర్లకు లక్షల్లో శాలరీ

పారదర్శకతపై కనిపించని జవాబుదారి



అధికారాలున్నాయి.. ఆదేశాలిచ్చే అధికారం ఉంది.. భారీ వేతనాలు తీసుకునే కమిషనర్లు ఉన్నారు.. కార్యాలయాలు, సిబ్బంది ఉన్నారు. అయినా ప్రజ లకు సమాచారం అందించడంలో ఇన్ని అవరోధా లెందుకు? అవినీతి, అక్రమాలను వెలికితీయాల్సిన సమాచార హక్కు చట్టానికే దిక్కులేకుండా పోతో ందా? 14,434 కేసులు పరిష్కరించామని గొప్పగా ప్రకటించుకుంటున్న తెలంగాణ సమాచార కమి షన్.. మరి 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల సంగతేంటి? ఐదు నెలల్లో 10,394 నోటీసులు జారీ చేస్తే వెబ్‌సైట్‌లో కనిపిస్తున్న నిర్ణయాలు 5,117 మాత్రమే ఎందుకు? తీర్పు లిచ్చిన తర్వాత వాటి కాపీలు అందించడానికి నెలల సమయం ఎందుకు పడుతోంది? ఆరు నెలల రికార్డులే ప్రజలకు అందుబాటులో ఉంటే మిగతా చరిత్రను దాచిపెట్టాల్సిన అవసరమేమిటి? వేతనంగా లక్షల తీసుకుంటున్న కమిషనర్లు ప్రజలకు అందిస్తున్న సేవలేమిటి? ప్రభుత్వ సహకారం లేదా.. అధికారుల నిర్లక్ష్యమా.. వ్యవస్థలో సమన్వయ లోపమా? అసలు తప్పెక్కడ జరుగుతోంది? సమాచార హక్కును కాపాడాల్సిన కమిషనే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తే సామాన్యుడికి న్యాయం చేసేది ఎవరు? కేసుల పరిష్కారమే కాదు.. ప్రజలకు జవాబుదారీతనం చూపించండి! తెలంగాణ సమాచార కమిషన్ పనితీరుపై ఆర్టీఐ కార్యకర్తలు సంధిస్తున్న ప్రశ్నల వెనుక అసలు వాస్తవాలేమిటో చూద్దాం!

- వివరాలు 5లో...



అమెరికా ఎన్నికల్లో భారతీయుల సత్తా

డెమొక్రాట్ల నుంచి ఐదుగురు కాంగ్రెస్‌కు!

భారత మూలాలున్న నేతలకు విజయాలు

రిపబ్లికన్ అభ్యర్థి వివేక్ రామస్వామికి ఓటమి

అమెరికా ఎన్నికల్లో తెలుగు వెలుగులు!

మేరీల్యాండ్‌లో అరుణ మిల్లర్ మళ్లీ గెలుపు

తెలంగాణ మూలాలున్న సరితకు నిరాశ

2026 అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో భారతీయ మూలాలున్న అభ్యర్థులు పలు కీలక విజయాలు సాధించారు. ముఖ్యంగా డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేసిన ఐదుగురు భారత సంతతి నేతలు ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. కాలిఫోర్నియా నుంచి అమీ బేరా, రో ఖన్నా, వర్జీనియా నుంచి సుహాస్ సుబ్రమణ్యం, వాషింగ్టన్ నుంచి ప్రమీలా జయపాల్ తిరిగి విజయం సాధించారు.

- వివరాలు 3లో...



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి

నిర్మాణంలో మరో 1.90 లక్షల ఇళ్లు

నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్స్

పేదల ఇళ్లలో పండుగ సంబరాలు:పొంగులేటి

ఈ దీపావళిని రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలోనే జరుపుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 2,21,500 ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

- వివరాలు 2లో...



వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే

సీఎం రేవంత్‌పై కేటీఆర్ నిప్పులు!

భూముల అమ్మకాల తీవ్ర ఆరోపణలు


"వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే ఎలా ఉంటుందో.. భూములు అమ్మే బ్రోకర్ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే అలా ఉంది" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

- 2లో...

అగ్నివీరులకు రెండేళ్ల పొడిగింపు

యువత అసంతృప్తికి బీజేపీ విరుగుడు

ఎన్నికల ముందు కేంద్రం కీలక నిర్ణయం



అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు కేవలం సైనిక నియామకాలకు సంబంధించిన నిర్ణయాలే కాదు.. రాజకీయంగా కూడా కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అగ్నివీరుల సర్వీసును మరో రెండేళ్లు పొడిగించి, ఆ తర్వాత కూడా సాయుధ దళాల్లో కొనసాగించే అవకాశం కల్పించే ప్రతిపాదన ఈ సమీక్షలో భాగంగా వెలుగులోకి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అగ్నిపథ్ విధానంపై సమీక్ష ప్రారంభించింది.

- వివరాలు 3లో...

అగ్నిపథ్‌పై యూటర్న్

ఎన్నికల భయమే కారణమా?.. పొడిగింపుపై కాంగ్రెస్ విమర్శలు

కేంద్రంపై పవన్ ఖేరా నిప్పులు

- 3లో...



ప్రకృతి ప్రకోపం... తల్లడిల్లితున్న ప్రజానీకం

తుపాన్లతో తూట్లు.. జనజీవనం పాట్లు

తీరని నష్టం.. పూడ్చటం కష్టం..!

పాలకులు నేర్చుకోవాలి పాఠం..

విలయాలు నేర్పుతున్న గుణపాఠం!

మొన్న అర్నబ్.. నేడు మురసు.. రేపు మరో తుపానా? బంగాళాఖాతం నుంచి దూసుకొస్తున్న ప్రచండ గాలులు ఆంధ్ర ప్రదేశ్ తీరాన్ని వణికిస్తున్నాయి. ఆకాశం నుంచి కురుస్తున్న వర్షం రైతు ఆశలను నీటిపాలు చేస్తుంటే.. నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు సామాన్యుడి జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం.. వందలాది ఇళ్లకు నష్టం.. నిలిచిపోయిన విద్యుత్ సరఫరా.. అస్తవ్యస్తమైన జనజీవనం! ఒకవైపు ఏపీ వరదలతో విలవిలలాడుతుంటే.. మరోవైపు తెలంగాణలో వర్షాభావం, ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు. ఒకే సమయంలో ఒకచోట వరద.. మరోచోట నీటి కటకట! అసలు ప్రకృతి ఎందుకిలా ప్రకోపిస్తోంది? సముద్రం ఎందుకు ఉగ్రరూపం దాలుస్తోంది? వాతావరణ మార్పులు తుపాన్ల తీవ్రతను పెంచుతున్నాయా? విపత్తులు వచ్చిన ప్రతిసారీ నష్టాన్ని లెక్కించడం, పరిహారం ప్రకటించడం మాత్రమే పరిష్కారమా? ప్రభుత్వాల ముందస్తు సన్నద్ధత ఎక్కడ? పర్యావరణ విధ్వంసానికి మనమే మూలమవుతున్నామా? ఇవి కేవలం తుపాన్ల కథలు కావు.. మనిషి ప్రకృతితో సాగిస్తున్న పోరాటానికి ప్రమాద ఘంటికలు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే రేపటి విపత్తు మరింత భయంకరం! అసలు కారణాలేంటి? మనం నేర్చుకోవాల్సిన పాఠాలేంటి?

- 4లో...



జాలర్ల రక్షణకు వెళ్లి వరదలో గల్లంతైన 11 మంది!

బేతుపల్లి చెరువులో రెండు బోట్లు బోల్తా

సహాయక చర్యలపై సీఎం, మంత్రి సమీక్ష

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువులో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాలతో చెరువు అలుగు పారుతుండటంతో చేపలు కొట్టుకుపోకుండా వలలు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన ఐదుగురు జాలర్లు వరద ప్రవాహంలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు తొలుత ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది బోటులో వెళ్లగా, బోటు మొరాయించడంతో వారూ చిక్కుకుపోయారు. దీంతో కొత్తగూడెం నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, అదనపు ఫైర్ సిబ్బంది, గైడ్‌లు మరో రెండు బోట్లలో సహాయక చర్యలకు వెళ్లారు. తొలుత చిక్కుకున్న ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం జాలర్లను రక్షించేందుకు వెళ్లిన రెండు బోట్లు ప్రమాదవశాత్తూ బోల్తాపడ్డాయి. ఈ ఘటనలో 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు.

రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. భద్రాచలం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గల్లంతైన సిబ్బంది కోసం గాలింపు చేపట్టారు. వరద ప్రవాహం కారణంగా సహాయక చర్యలు సవాలుగా మారడంతో డ్రోన్ల ద్వారా లైఫ్ జాకెట్లు పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మరోవైపు, చిక్కుకున్న ఐదుగురు జాలర్లు సురక్షితంగానే ఉన్నట్లు సమాచారం అందింది. గల్లంతైన సిబ్బంది ఆచూకీ కోసం అధికారులు అన్ని మార్గాల్లో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

క్షేమంగా తీసుకురావడమే లక్ష్యం

ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. గల్లంతైన ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ పరికరాలు, అవసరమైన బోట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో నిరంతరం మాట్లాడుతున్నామని, సహాయక చర్యల పురోగతిని సమీక్షిస్తున్నామని తెలిపారు. గల్లంతైన సిబ్బందిని క్షేమంగా బయటకు తీసుకురావడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు గురువారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లనున్నట్లు వెల్లడించారు.

రైతుల సమక్షంలోనే కొలతలు..

ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే

భూ వివాదాలకు ఇక శాశ్వత పరిష్కారం!

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపడుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రైతుల సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టి, వారి అభ్యంతరాలు, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి భూ యజమానికి ఆధార్ కార్డు తరహాలో భూమికి సంబంధించిన సమగ్ర రికార్డులు, భద్రతతో కూడిన పాస్‌బుక్కులు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

అధికారులపై నిరంతర పర్యవేక్షణ

బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. తొలివిడతలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో సర్వే వేగంగా చేపట్టాలని సూచించారు. సర్వే జరిగే గ్రామాల్లో తహశీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు కనీసం వారానికోసారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, అధికారులకు ఎదురవుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రోత్సహిస్తామని, ప్రజలను ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో భూ సర్వే జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు ఈ కార్యక్రమం పరిష్కారం చూపుతుందని వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూ హద్దుల గొడవలను కూడా గుర్తించి పరిష్కరిస్తామన్నారు. 22ఏ నిషేధిత భూములకు సంబంధించి గతంలో జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీ ఈటల రాజేందర్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రైతులకు వివాదరహిత భూములు అందించడమే ఈ సమగ్ర సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

రెండు నెలల్లో కొత్త భవనం నిర్మించాలి

మెడికల్ కాలేజీ దుస్థితిపై హరీశ్ రావు ఆగ్రహం



మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కనీస సౌకర్యాలు కల్పించాలంటూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. మాజీ మంత్రి హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, క్యామ మల్లేశ్‌తో కలిసి ధర్నా శిబిరాన్ని సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. కాలేజీలో తాగునీరు, వాష్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, లైబ్రరీ, హాస్టల్ సౌకర్యాలు లేవని, బస్సులు లేక రెండు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవనానికి అద్దె, విద్యుత్, నీటి బిల్లులు చెల్లించకపోవడంతో యజమాని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫైర్ సేఫ్టీ, ఆక్యుపెన్సీ అనుమతులు కూడా లేవని విమర్శించారు.

రెండు నెలల్లో కొత్త భవనం ఏర్పాటు చేయాలి

కేసీఆర్ హయాంలో కాలేజీ కోసం రూ.182 కోట్లు, 400 పడకల ఆసుపత్రి మంజూరు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లలేదని హరీశ్‌రావు ఆరోపించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎంఈ వాణీదేవితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రెండు నెలల్లో అన్ని వసతులున్న ప్రభుత్వ లేదా అద్దె భవనానికి కాలేజీని మార్చాలని, అప్పటివరకు బస్సులు, తాగునీరు, వాష్‌రూమ్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థులకు రాతపూర్వక హామీ ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని, అవసరమైతే అసెంబ్లీలోనూ ప్రస్తావిస్తామని భరోసా ఇచ్చారు.

సదర్‌కు రాష్ట్ర పండుగ హోదా!

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ వేడుక

యాదవుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: సీఎం



సదర్ సమ్మేళనం యాదవులకే పరిమితమైన వేడుక కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సదర్ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోటకు ఒకప్పుడు గొల్లంకొండ అనే పేరు ఉండేదని గుర్తుచేశారు. నగరం ఇంతగా అభివృద్ధి చెందడంలో యాదవుల పాత్ర ఎంతో ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వారిని యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. గతంలో ఏ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించలేదని, యాదవుల ఆకాంక్ష మేరకు తమ ప్రభుత్వం ఆ గుర్తింపునిచ్చిందని తెలిపారు. సదర్ సమ్మేళనం నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.

యాదవులకు రాజకీయంగా సముచిత స్థానం

తెలంగాణలో తమ ప్రభుత్వం కులగణన నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచే విధానాన్ని అమలు చేసిందని సీఎం పేర్కొన్నారు. యాదవులకు రాజకీయంగా, పాలనాపరంగా తగిన ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చామని వివరించారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట ఆలయ బోర్డు సభ్యురాలిగా నియమించామని తెలిపారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని, వారి ఆత్మగౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూసే బాధ్యత తమదేనని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చగల కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మూసీ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి కార్యక్రమాలు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల అమలుకు యాదవ సోదరులు సహకరించాలని కోరారు. సమాజంలోని అన్ని వర్గాలకు సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని సీఎం తన ప్రసంగంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ ముఖ్ నేత తేజస్వీ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కృష్ణుడి వారసులం.. ఎవరికీ భయపడం!

లాలూ పోరాటం.. మా రక్తంలోనే ధైర్యం

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తేజస్వి యాదవ్ ఫైర్



బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఆర్జేడీ నేత, బీహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన యాదవుల సదర్ ఉత్సవంలో పాల్గొన్న ఆయన, తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలతో వేధించారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను ప్రయోగించి జైలుకు పంపినా లాలూ ఎప్పుడూ తలవంచలేదన్నారు. మేము శ్రీకృష్ణుడి వారసులం.. ఎవరికీ భయపడం. జైలుకు పంపుతామని బెదిరించినా వెనక్కి తగ్గేది లేదు అని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

కృష్ణుడిపై వ్యాఖ్యలు.. శాస్త్రిపై ఆగ్రహం

ఉత్తరప్రదేశ్ ఎన్నికల నేపథ్యంలో ధీరేంద్ర శాస్త్రి అలియాస్ బాగేశ్వర్ బాబా శ్రీకృష్ణుడిపై చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలను తేజస్వి తప్పుబట్టారు. ఆయనను 'ధగేశ్వర్ శాస్త్రి' అంటూ విమర్శించారు. మతాలనే కాదు.. దేవుళ్ల మధ్య కూడా విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి యాదవ సమాజం తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా శ్రీకృష్ణుడు, శ్రీరాముడిపై వివాదాస్పద వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు ప్రియాంక చతుర్వేది సైతం మతపెద్దల వ్యాఖ్యలను ప్రశ్నించాలని కోరారు.

కులగణనకు ప్రశంసలు

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన కులగణనను తేజస్వి ప్రశంసించారు. బీహార్‌లో తాము అధికారంలో ఉన్నప్పుడు 17 నెలల్లో కులగణన పూర్తి చేసి, రిజర్వేషన్లను 65 శాతానికి పెంచామని గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని రేవంత్ రెడ్డికి సూచించారు. మరోవైపు బీహార్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం నేరస్థులకు అండగా నిలుస్తోందని విమర్శించారు. మధుబని జిల్లా బాబుబర్హి గ్రామంలో పోలీసు ఏఎస్ఐ కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడిన ఘటనపై ప్రభుత్వాన్ని నిలదీశారు. పోలీసులే సామాన్యులపై కాల్పులు జరిపే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

డీప్‌టెక్‌కు తెలంగాణే గ్లోబల్ హబ్!

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

పరిశోధనల నుంచి ప్రజలకు ఉపయోగపడేలా ఉత్పత్తులు

ఆవిష్కరణలకు ప్రభుత్వ అండ, ప్రోత్సాహం: భట్టి విక్రమార్క

తెలంగాణను ప్రపంచస్థాయి సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే ఉత్పత్తులు, సేవలుగా మారాలని ఆకాంక్షించారు. ఇందుకోసం పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. 2034-35 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యమని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐఐటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ప్రముఖ ఇంజినీరింగ్ సంస్థలు హైదరాబాద్‌కు ప్రధాన బలమని భట్టి పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ, హిల్ట్ పాలసీ వంటి కార్యక్రమాలు పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని చెప్పారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, ఇంజినీరింగ్ రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న సామర్థ్యాన్ని డీప్‌టెక్ ఆవిష్కరణలకు ఉపయోగించుకోవాలని సూచించారు. స్టార్టప్‌లకు ఎదురయ్యే పెట్టుబడులు, పరీక్షా కేంద్రాలు, తొలి వినియోగదారుల సమస్యలను ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పరిష్కరించాలని కోరారు. ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ మార్గదర్శకాలు, ప్రయోగాత్మక కొనుగోళ్ల ద్వారా కొత్త ఆవిష్కరణలను విజయవంతమైన ఉత్పత్తులుగా మార్చవచ్చన్నారు. విద్యుత్ నిల్వ వ్యవస్థలు, పునరుత్పాదక ఇంధనం, వైద్య నిర్ధారణ పరికరాలు, వ్యవసాయ సాంకేతికతలో డీప్‌టెక్‌కు అపార అవకాశాలున్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసే పరిజ్ఞానం, సౌర విద్యుత్‌ను నిల్వ చేసుకునే విధానాలు అభివృద్ధి చేయాలని సూచించారు. రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచే పరిష్కారాలు, వ్యాధులను ముందుగానే గుర్తించే వైద్య పరికరాలు అందుబాటులోకి రావాలన్నారు. ఆవిష్కరణలు సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండాలని, యువతకు ఉపాధి కల్పించే నైపుణ్య శిక్షణకు పరిశ్రమలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో పరిశోధనలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తామని తెలిపారు. 1927లో ఏర్పడిన ఫిక్కీ శతాబ్ది సందర్భంగా సంస్థ సేవలను ప్రశంసిస్తూ, డీప్‌టెక్ సవాళ్ల పరిష్కారంలో మరింత చొరవ చూపాలని కోరారు.



వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే సీఎం రేవంత్‌పై కేటీఆర్ నిప్పులు!

భూముల అమ్మకాల తీవ్ర ఆరోపణలు

"వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే ఎలా ఉంటుందో.. భూములు అమ్మే బ్రోకర్ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే అలా ఉంది" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మియాపూర్ భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. గతంలో కాంగ్రెస్ హయాంలో కబ్జాకు గురైన 550 ఎకరాల భూమిని న్యాయపోరాటం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం కాపాడిందని తెలిపారు. ప్రముఖ న్యాయవాది వైద్యనాథన్ ద్వారా కేసు వాదించామని, ఇటీవల సుప్రీంకోర్టు ఆ భూములు ప్రభుత్వానివేనని తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.

అమ్మకాలపై విమర్శలు.. అభివృద్ధిపై ప్రశ్నలు

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించి ఆ భూములను అమ్ముతామని ప్రకటించారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో హైదరాబాద్‌లో ఒక్క నిర్మాణమైనా చేపట్టిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో లక్షలాది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించామని గుర్తుచేశారు. పదవుల కోసం ఢిల్లీ నాయకుల వద్ద తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని కాంగ్రెస్, బీజేపీ నేతలను దుయ్యబట్టారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అమిత్ షా వద్ద బౌన్సర్‌లా వ్యవహరిస్తున్నారని, ప్రియాంక గాంధీ సమక్షంలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిని సైతం పక్కకు నెట్టేశారని వ్యాఖ్యానించారు.

ప్రాజెక్టులపై రాజకీయ రగడ

తెలంగాణకు అమిత్ షా వచ్చి చేతులు ఊపి వెళ్లడం తప్ప ఏమిచ్చారని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న కక్షతో దాదాపు వెయ్యి టీఎంసీల నీటిని వృథాగా దిగువకు వదిలేశారని ఆరోపించారు. కరువు వచ్చినప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు విలువ తెలుస్తుందని కేసీఆర్ గతంలో చెప్పారని గుర్తుచేశారు. నీటిని ఎత్తిపోసి సాగుకు అందించాలని సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న నీటి ఎద్దడి ప్రకృతి సృష్టించినది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో వచ్చిన కరువని కేటీఆర్ ఆరోపించారు.

కొడంగల్‌లో 3 రోజుల రైతు జాతర!

నవంబర్ 7న సీఎం చేతుల మీదుగా ప్రారంభం



రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించేందుకు నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్‌లో మెగా రైతు మేళా నిర్వహించనున్నారు. 7వ తేదీ ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం 26 ప్రభుత్వ శాఖలు, సంస్థల భాగస్వామ్యంతో 150 ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, సాగు పరికరాలను ప్రదర్శించనున్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సమావేశాలు నిర్వహించి ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, మార్కెట్ అవకాశాలపై వివరించనున్నారు. మొదటి రోజు 7,500 మంది రైతులు పాల్గొననుండగా, పరికరాలు, డ్రిప్ యూనిట్లు, భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేయనున్నారు.

మహిళా రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు

రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించి ఆధునిక సాగు, ఆదాయ అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. మూడో రోజు పొరుగు జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా. రైతుల విజయగాథలు, సాంకేతిక పరిజ్ఞానం, అధిక దిగుబడులు సాధించే విధానాలపై చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి ప్రసంగంతో మేళా ముగుస్తుందని మంత్రి తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి

నిర్మాణంలో మరో 1.90 లక్షల ఇళ్లు

నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్స్

పేదల ఇళ్లలో పండుగ సంబరాలు:పొంగులేటి

ఈ దీపావళిని రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలోనే జరుపుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 2,21,500 ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, హౌసింగ్ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెళ్లి లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి గుర్తుగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' పోస్టర్‌ను మంత్రులు ఆవిష్కరించారు.



నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్స్

ఇళ్ల నిర్మాణంలో భాగంగా తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలు, హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు పొంగులేటి వివరించారు. హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ నగరాల్లో జీ+5 విధానంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను దీపావళిలోగా విడుదల చేస్తామన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌లో వచ్చే ఏడాది బోనాల పండుగ నిర్వహిస్తామని తెలిపారు.

రూ.40 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా రూ.40 వేల కోట్లతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రతి సోమవారం నేరుగా, పారదర్శకంగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. పేదలకు భద్రతతో కూడిన సొంతింటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దీపావళి వేడుకల్లో లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఇంట వెలిగే ప్రతి దీపం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.

1,741 మందికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని అల్పాదాయ వర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో మరో 1,741 ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది. గతంలో ఎంపికైన వారిలో క్షేత్రస్థాయి పరిశీలనలో అనర్హులుగా తేలినవారు, ఆర్థిక కారణాలతో కేటాయింపులు రద్దు చేసుకున్నవారి స్థానంలో ఏర్పడిన ఖాళీలను బుధవారం నిర్వహించిన మాప్-అప్ ఈ-లాటరీ ద్వారా భర్తీ చేశారు. మొత్తం 14 నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయగా, అదనంగా 875 మందిని వెయిటింగ్ లిస్టులో చేర్చారు. ఖైరతాబాద్‌లో అత్యధికంగా 327, మహేశ్వరంలో 201, మలక్‌పేటలో 171 ఇళ్లు కేటాయించారు. ఎంపికైన వారందరికీ ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపారు. త్వరలో అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియలో హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు.

రాజ్య సంస్కరణ
గురువారం, 5.11.2026, మేడ్చల్ మల్కాజిగిరి

ఇరాన్ వార్ కొంపముంచింది

మిడ్‌టర్మ్ ఓటమికి యుద్ధమే కారణం

రిపబ్లికన్ల పరాజయంపై ట్రంప్ రియాక్షన్



అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురైన ఘోర పరాజయంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగిన యుద్ధం తమ పార్టీ ఓటమికి కారణమైందన్న అభిప్రాయంతో ఆయన ఏకీభవించారు. ఈ యుద్ధం ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందా అని ప్రశ్నించగా, అది చాలావరకు నిజమేనని అంగీకరించారు. దీంతో ఎన్నికల ఓటమికి ఇరాన్ యుద్ధం కూడా ప్రధాన కారణమన్న విషయం ట్రంప్ మాటల్లోనే బయట పడింది. ఇప్పటివరకు యుద్ధంపై తన ప్రభుత్వ వైఖరిని సమర్థించుకుంటూ వచ్చిన ట్రంప్, తాజా వ్యాఖ్యలతో రాజకీయంగా ఎదురైన నష్టాన్ని పరోక్షంగా అంగీకరించినట్లయింది.

ఆర్థిక భారం.. ఓటర్లలో అసంతృప్తి

ఇరాన్‌తో యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపడంతో పాటు సామాన్య ప్రజలపై అదనపు భారాన్ని మోపింది. పెరుగుతున్న జీవన వ్యయం, నిత్యావసరాల ధరలు, యుద్ధానికి సంబంధించిన ఖర్చులు ఓటర్లలో అసంతృప్తిని పెంచాయి. ట్రంప్ ప్రభుత్వం అనుసరించిన సుంకాల విధానాలు కూడా ప్రజల వ్యతిరేకతకు కారణమయ్యాయి. ముఖ్యంగా యుద్ధం వల్ల ఎదురవుతున్న ఆర్థిక సమస్యలు రిపబ్లికన్ పార్టీకి మద్దతుగా ఉన్న ఓటర్లను సైతం పునరాలోచనలో పడేశాయి. ఈ పరిణామాలు డెమొక్రాట్లకు అనుకూలంగా మారాయి.

డెమొక్రాట్లకు కలిసొచ్చిన యుద్ధ వ్యతిరేకత

మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ ఆధిక్యం సాధించడంతో ట్రంప్ రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ తిన్నారు. యుద్ధంపై ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత డెమొక్రాట్లకు ఓట్ల రూపంలో కలిసొచ్చింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సైతం తమ పార్టీ ఓటమికి యుద్ధమే కారణమని గతంలో వ్యాఖ్యానించారు. ఇప్పుడు ట్రంప్ కూడా ఆ అభిప్రాయాన్ని చాలావరకు సమర్థించడంతో రిపబ్లికన్ల పరాజయంలో ఇరాన్ యుద్ధం పాత్రపై స్పష్టత పెరిగింది. యుద్ధ నిర్ణయాలు తీసుకునేది పాలకులైనా, వాటి ఆర్థిక మూల్యం చెల్లించేది ప్రజలేనన్న సందేశాన్ని అమెరికా ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాలకు అందించాయి.

మస్క్ కు మిడ్ టర్మ్ షాక్



రూ.4,700 కోట్ల పెట్టుబడి బూడిదేనా?

మస్క్ వ్యాపారాలపై డెమొక్రాట్ల గురి !

అమెరికా రాజకీయాల్లో అత్యంత ప్రభావశీల బిలియనీర్ గా ఎదిగిన ఎలాన్ మస్క్ కు మిడ్ టర్మ్ ఎన్నికల ఫలితాలు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. రిపబ్లికన్ అభ్యర్థుల విజయానికి ఆయన దాదాపు రూ.4,700 కోట్లు ఖర్చు చేసినట్లు కథనం వెల్లడించింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం కూడా పావు బిలియన్ డాలర్లకు పైగా వెచ్చించారు. టెక్సాస్ లో రిపబ్లికన్ల ఆధిపత్యం కొనసాగేందుకు ప్రత్యేకంగా ప్రచారం చేశారు. అయితే ఎన్నికల్లో డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్ ను కైవసం చేసుకోవడంతో మస్క్ రాజకీయ పెట్టుబడికి ఆశించిన ఫలితం దక్కలేదు. టెక్సాస్ గవర్నర్ ఎన్నికల్లోనూ మూడు దశాబ్దాలకు పైగా తర్వాత డెమొక్రాట్ల అభ్యర్థి గినా హినోజోసా విజయం సాధించి గ్రెగ్ అబాట్ కు ఓటమి మిగిల్చారు. రిపబ్లికన్లకు అండగా నిలిచిన మస్క్ కు ఇప్పుడు రాజకీయంగానే కాకుండా వ్యాపారపరంగానూ సవాళ్లు ఎదురవుతున్నాయి.

డెమొక్రాట్ల దర్యాప్తు హెచ్చరిక

ఎన్నికల్లో డెమొక్రాట్లు విజయం సాధిస్తే తన వ్యాపార సామ్రాజ్యంపై విస్తృత దర్యాప్తులు చేపడతారన్న వార్తలతో మస్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఎన్నికల పరిణామాల నేపథ్యంలో ప్రీమార్కెట్ ట్రేడింగ్ లో స్పేస్ ఎక్స్ షేర్లు 3.8 శాతం, టెస్లా షేర్లు 3.6 శాతం పడిపోయాయి. డేటా సెంటర్లకు అనుమతులు ఆలస్యమైతే మస్క్ ఆశిస్తున్న వ్యాపార అవకాశాలకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పాత వివాదాలపై మళ్లీ విచారణ?

మస్క్ వ్యాపారాలపై డెమొక్రాట్లకు ఇప్పటికే పలు అభ్యంతరాలున్నాయి. ఉక్రెయిన్ కు సంబంధించిన సైనిక ఉపగ్రహ సమాచార సేవలపై ఆంక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో భారీ కోతలు, ఆయన సంస్థలకు లభిస్తున్న ప్రభుత్వ కాంట్రాక్టులు, రాయితీలపై గతంలోనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ పై డెమొక్రాట్లకు పట్టు రావడంతో ఈ అంశాలపై విచారణకు మార్గం సుగమమవుతుందని భావిస్తున్నారు. ప్రతినిధుల సభ పర్యవేక్షణ కమిటీకి రానున్న చైర్మన్ రాబర్ట్ గార్సియా ట్రంప్, ఆయన కుటుంబం, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉద్దేశించి న్యాయవాదులను సిద్ధం చేసుకోండి అంటూ హెచ్చరించారు. సాక్షులను పిలిపించడం, పత్రాలు కోరడం, సమన్లు జారీ చేయడం వంటి అధికారాలు ఈ కమిటీకి ఉన్నాయి.

అమెరికా ఎన్నికల్లో భారతీయుల సత్తా

డెమొక్రాట్ల నుంచి ఐదుగురు కాంగ్రెస్‌కు!

భారత మూలాలున్న నేతలకు విజయాలు

రిపబ్లికన్ అభ్యర్థి వివేక్ రామస్వామికి ఓటమి

2026 అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో భారతీయ మూలాలున్న అభ్యర్థులు పలు కీలక విజయాలు సాధించారు. ముఖ్యంగా డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేసిన ఐదుగురు భారత సంతతి నేతలు ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. కాలిఫోర్నియా నుంచి అమీ బేరా, రో ఖన్నా, వర్జీనియా నుంచి సుహాస్ సుబ్రమణ్యం, వాషింగ్టన్ నుంచి ప్రమీలా జయపాల్ తిరిగి విజయం సాధించారు. ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి పియా దండియా తొలిసారి విజయం సాధించి కాంగ్రెస్‌లో అడుగుపెట్టనున్నారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్ కూడా గవర్నర్ వెస్ మూర్‌తో కలిసి మరోసారి ఎన్నికయ్యారు. భారతీయ మూలాలున్న నేతల ప్రాతినిధ్యం అమెరికా రాజకీయాల్లో మరింత బలపడటం ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాష్ట్ర స్థాయి ఎన్నికల్లోనూ భారతీయుల ప్రభావం

రాష్ట్రస్థాయిలోనూ భారత మూలాలున్న పలువురు నేతలు విజయాలు సాధించారు. విస్కాన్సిన్ అటార్నీ జనరల్‌గా డెమొక్రాట్ జోష్‌కౌల్, వాషింగ్టన్ డీసీ కౌన్సిల్‌కు అపర్ణా రాజ్, జార్జియా రాష్ట్ర ప్రతినిధుల సభకు జ్యోత్ సింగ్ విజయం సాధించినట్లు ఎన్నికల నివేదికలు వెల్లడించాయి. పెన్సిల్వేనియాలో అరవింద్ వెంకట్, ఇల్లినాయిస్ సెనేట్‌కు రామ్ విల్లివాలమ్ కూడా తిరిగి ఎన్నికయ్యారు. మరోవైపు రిపబ్లికన్ పార్టీ తరఫున ఒహియో గవర్నర్ పదవికి పోటీ చేసిన వివేక్ రామస్వామి డెమొక్రాట్ అమీ ఆక్టన్ చేతిలో ఓటమి చవిచూశారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ ఎన్నికల్లో రిపబ్లికన్ శరిత కొమటిరెడ్డి కూడా ఓడిపోయారు.

భారత్‌తో సంబంధాలపై ఆసక్తికర చర్చ

ఈ విజయాలతో అమెరికా రాజకీయాల్లో భారత సంతతి నేతల ప్రాధాన్యం మరోసారి చర్చకు వచ్చింది. అయితే భారత మూలాలున్నంత మాత్రాన వారంతా భారత అనుకూల విధానాలు అనుసరిస్తారని భావించలేం. వారి విదేశాంగ విధానాలు, భారత్‌తో సంబంధాలపై గత వైఖరిని విడిగా పరిశీలించాల్సి ఉంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్‌లో గెలిచిన భారత సంతతి నేతలు, రిపబ్లికన్ పార్టీకి చెందిన నేతల రాజకీయ ప్రాధాన్యాలు భిన్నంగా ఉండవచ్చు. భారత్‌కు అనుకూలంగా నిలిచే అమెరికా విధానాలకు మద్దతు ఎవరు ఇస్తారన్నది రాబోయే రోజుల్లో కీలకం కానుంది.



అమెరికా ఎన్నికల్లో తెలుగు వెలుగులు!

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో భారతీయ సంతతికి చెందిన పలువురు అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా, తెలుగు మూలాలున్న నాయకులు కూడా ప్రత్యేకంగా వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో జన్మించిన అరుణ మిల్లర్ మరోసారి మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయం సాధించారు. మరోవైపు తెలంగాణ మూలాలున్న సరిత కొమటిరెడ్డి న్యూయార్క్ అటార్నీ జనరల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూశారు. అమెరికా రాజకీయాల్లో తెలుగు మూలాలున్న వారి ప్రాతినిధ్యం, ప్రభావం మరోసారి చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లో జన్మించిన అరుణ మిల్లర్ ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి అమెరికాకు వెళ్లారు. సివిల్ ఇంజినీరింగ్ చదివిన ఆమె సుమారు 25 ఏళ్ల పాటు రవాణా, మౌలిక సదుపాయాల రంగంలో పనిచేశారు. అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి మేరీల్యాండ్ హౌస్ ఆఫ్ డెలిగేట్స్‌కు ఎన్నికయ్యారు. 2022లో లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2026 ఎన్నికల్లో గవర్నర్ వెస్ మూర్‌తో కలిసి మరోసారి విజయం సాధించారు. తెలుగు మూలాలున్న సరిత కొమటిరెడ్డి రిపబ్లికన్ పార్టీ తరఫున న్యూయార్క్ అటార్నీ జనరల్ పదవికి పోటీ చేశారు. గతంలో అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన ఆమెకు న్యాయరంగంలో అనుభవం ఉంది.

అమెరికా మిడ్‌టర్మ్ దెబ్బ

వాషింగ్టన్‌లో ట్రంప్‌కు పరాజయం

ఖమేనీకి రాజకీయ అస్త్రం!

ఫలితాలతో ఇరాన్‌లో విజయోత్సాహం

యుద్ధమే కొంపముంచిందన్న వాన్స్



అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురైన ఎదురుదెబ్బను ఇరాన్ తన విజయంగా అభివర్ణిస్తోంది. డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ ఆధిపత్యం సాధించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజకీయంగా గట్టి దెబ్బ తగిలిందని ఇరాన్ భద్రతా విభాగం అధిపతి మొహ్సెన్ రెజాయ్ వ్యాఖ్యానించారు. యుద్ధభూమిలో వ్యూహాత్మకంగా, వాషింగ్టన్‌లో రాజకీయంగా ట్రంప్‌ను ఓడించామని ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించారు. అమెరికా ప్రజలు యుద్ధం కారణంగా పెరిగిన ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇరాన్‌తో తలపడే ఏ దేశమైనా యుద్ధరంగం నుంచి తమ ఇంటి గడప వరకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పెరుగుతున్న జీవన వ్యయం, ట్రంప్ సుంకాల విధానాలు, అమెరికాఇరాన్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఆర్థిక ఒత్తిడి ఓటర్లలో అసంతృప్తిని పెంచాయని ఇరాన్ అభిప్రాయపడుతోంది.

విధానాలు మారవంటున్న సుప్రీం నేత

మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ట్రంప్‌కు ఎదురైన పరాజయం అమెరికా విదేశాంగ విధానంలో మార్పు తీసుకురాదని ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ స్పష్టం చేశారు. అమెరికాలో పార్టీలు మారినా, అధికార సమీకరణాలు మారినా ఇరాన్ పట్ల వాషింగ్టన్ వైఖరిలో మార్పు ఉండదని పేర్కొన్నారు. అమెరికాకు రాయితీలు ఇవ్వడం ద్వారా ఇరాన్‌పై శత్రుత్వాన్ని తగ్గించవచ్చని భావించడం పొరపాటని హెచ్చరించారు. తమ దేశంపై మరోసారి దాడులు జరిగితే యుద్ధ పరిధి మరింత విస్తరిస్తుందని స్పష్టం చేశారు. అమెరికా రాజకీయ పరిణామాలను ఇరాన్ తనకు అనుకూలంగా మలుచుకుంటున్నా, ఘర్షణ విషయంలో వెనక్కి తగ్గే సంకేతాలు ఇవ్వడం లేదు.

యుద్ధమే ఓటమికి కారణమన్న వాన్స్

మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా రిపబ్లికన్ల ఓటమికి ఇరాన్ యుద్ధం ప్రధాన కారణమని అంగీకరించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, తమ పార్టీ ఓటమికి యుద్ధమే కారణమని పేర్కొన్నారు. యుద్ధంపై ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత, దాని ఆర్థిక ప్రభావాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయని ఆయన వ్యాఖ్యల సారాంశం. దీంతో అమెరికా అంతర్గత రాజకీయాల్లో ఇరాన్ యుద్ధం ఎంతటి ప్రభావం చూపిందో స్పష్టమవుతోంది. ట్రంప్‌కు ఎన్నికల రూపంలో ఎదురైన దెబ్బను ఇరాన్ అంతర్జాతీయ రాజకీయ విజయంగా ప్రచారం చేసుకుంటుండగా, యుద్ధం అమెరికా రాజకీయాలపై చూపిన ప్రభావం ఇప్పుడు కీలక చర్చగా మారింది.

ట్రంప్ చేతిలో వీటో అస్త్రం

కాంగ్రెస్‌పై డెమొక్రాట్ల పట్టు

చట్టాలను అడ్డుకునేందుకు సిద్ధం

అంతిమ అధికారం నాదేనంటూ సవాళ్లు

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌పై ఆధిపత్యం సాధించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొత్త రాజకీయ సవాల్ ఎదురైంది. కాంగ్రెస్‌లో డెమొక్రాట్ల బలం పెరగడంతో ట్రంప్ ప్రభుత్వ విధానాలకు అడ్డంకులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తన చేతిలో ఉన్న అధ్యక్ష అధికారాన్ని ప్రయోగించేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నారు. అధ్యక్షుడి వేటో అధికారమే తనకు ఉన్న అంతిమ అస్త్రమని ఆయన వ్యాఖ్యానించారు. డెమొక్రాట్లు తీసుకొచ్చే బిల్లులు తనకు ఆమోదయోగ్యం కాకపోతే వాటిని తిరస్కరిస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే అన్ని బిల్లులనూ అడ్డుకుంటానని హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌తో పాటు సీబీఎస్ ఇంటర్వ్యూల్లోనూ తన వైఖరిని వెల్లడించారు. ట్రూత్ సోషల్‌లో 'వీటో' అని పోస్టు చేయడం ద్వారా తన ఉద్దేశాన్ని మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో డెమొక్రాట్ల ఆధిపత్యం పెరిగినా, అధ్యక్ష అధికారంతో వారి నిర్ణయాలను అడ్డుకుంటానన్నది ట్రంప్ సంకేతం.

అమెరికా రాజ్యాంగం కల్పించిన అధికారం

అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ 1, సెక్షన్7 ప్రకారం అధ్యక్షుడికి వేటో అధికారం ఉంటుంది. ప్రతినిధుల సభ, సెనేట్ ఆమోదించిన బిల్లు అధ్యక్షుడి వద్దకు చేరినప్పుడు దానిపై సంతకం చేసి చట్టంగా మార్చవచ్చు. లేదా అభ్యంతరాలు తెలుపుతూ తిరిగి కాంగ్రెస్‌కు పంపవచ్చు. బిల్లు అందిన తర్వాత ఆదివారాలను మినహాయించి పది రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. ఈ సమయంలో కాంగ్రెస్ సమావేశాలు కొనసాగితే అధ్యక్షుడు స్పందించని బిల్లు సాధారణంగా చట్టమవుతుంది. అయితే కాంగ్రెస్ వాయిదా పడటంతో బిల్లును తిరిగి పంపే అవకాశం లేకపోతే అది చట్టం కాకుండా నిలిచిపోతుంది. దీనినే పాకెట్ వీటో అంటారు.

ట్రంప్ వీటోను అధిగమించగలదా కాంగ్రెస్?

అధ్యక్షుడి వేటో అంతిమ నిర్ణయం కాదు. కాంగ్రెస్‌కు దానిని అధిగమించే అధికారం కూడా రాజ్యాంగం కల్పించింది. అయితే ఇందుకు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. 435 మంది సభ్యుల సభలో 290 ఓట్లు, 100 మంది సభ్యుల సెనేట్‌లో 67 ఓట్లు సాధించాలి. డెమొక్రాట్లకు ఈ స్థాయి బలం లేకపోతే రిపబ్లికన్ సభ్యుల మద్దతు కూడా అవసరమవుతుంది. మరోవైపు వేటోను కేవలం బిల్లులను తిరస్కరించే ఆయుధంగానే కాకుండా, రాజకీయ చర్చల్లో ఒత్తిడి పెంచే సాధనంగా కూడా ట్రంప్ ఉపయోగించుకోవచ్చు. తాను వ్యతిరేకించే బిల్లులను అడ్డుకుంటానని హెచ్చరించడం ద్వారా డెమొక్రాట్లను చర్చలకు రప్పించాలని భావిస్తున్నారు.

భారత్‌లోనూ మార్పు

అమెరికా తీర్పుతో విపక్షాల్లో ఆశలు

ప్రజాశక్తి ముందు తలవంచాల్సిందే..!

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయాన్ని భారత్‌లోని ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వాదనలకు బలంగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజల ఐక్యత ముందు ఎంతటి అధికార బలమైనా నిలవలేదని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ, అమెరికా ఎన్నికల ఫలితాలు మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. పెద్ద కార్పొరేట్ సంస్థలు, అనుకూల మీడియా వ్యవస్థలు, విభజనను ప్రోత్సహించే సోషల్ మీడియా వేదికలు అండగా ఉన్నప్పటికీ ప్రజల సమష్టి శక్తి నిరంకుశ ధోరణులను ఓడించగలదని అన్నారు. ప్రజాస్వామ్యం బిలియనీర్లది కాదు.. సామాన్య పౌరులదని స్పష్టం చేశారు. ప్రజలు తమ హక్కులు, స్వేచ్ఛల కోసం ఐక్యంగా నిలబడి గొంతు వినిపిస్తే ఎలాంటి శక్తినైనా ఎదుర్కోగలరని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలను భారత రాజకీయాలకు అన్వయిస్తూ ఇండియా కూటమి ఐక్యతను కూడా ప్రస్తావించారు.

మోదీ ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ విమర్శలు

కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ విభాగం అధిపతి జైరాం రమేశ్ అమెరికా ఫలితాలను ట్రంప్‌కు ప్రజలు ఇచ్చిన గట్టి తీర్పుగా అభివర్ణించారు. మిడ్‌టర్మ్ ఎన్నికలు ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ప్రశ్నించే కీలక అవకాశమని పేర్కొన్నారు. భారత్‌లో మోదీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానం అమలైతే ప్రభుత్వాలపై మధ్యంతర కాలంలో ప్రజలు తీర్పు చెప్పే అవకాశం తగ్గిపోతుందని విమర్శించారు. అమెరికా ఎన్నికలతో రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో కీలకమైన అధికార సమతుల్యత తిరిగి ఏర్పడిందని, భారత్‌లో 2014 నుంచి ఆ సమతుల్యత ప్రమాదంలో పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ సైతం ప్రజలు అసహజ రాజకీయ ధోరణులను సాధారణంగా అంగీకరించరని, సమయం వచ్చినప్పుడు వాటిని తిరస్కరిస్తారని వ్యాఖ్యానించారు. అమెరికా ఎన్నికల తీర్పు ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం ఎంత ముఖ్యమో గుర్తు చేస్తోందని విపక్ష నేతలు చెబుతున్నారు.

అబ్దుల్ విజయం.. ఒవైసీ రాజకీయ వ్యాఖ్యలు

అమెరికా ఎన్నికల్లో డెమొక్రాట్ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయిద్ విజయం సాధించడంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రత్యేకంగా స్పందించారు. అమెరికా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లింగా అబ్దుల్ చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావిస్తూ, మిషిగన్‌లో ఒక అబ్దుల్ గెలిచాడని, ఉత్తరప్రదేశ్‌లోని అబ్దుల్ కూడా తన రాజకీయ గుర్తింపును బలోపేతం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. ముస్లిం గుర్తింపును అవమానకరంగా మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తూ, ఆత్మగౌరవంతో రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. మరోవైపు ట్రంప్ విధానాలపై అమెరికా ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత, ఇరాన్ యుద్ధ ప్రభావం, నిత్యావసరాల ధరలు, డీజిల్ ధరల పెరుగుదల రిపబ్లికన్ల ఓటమికి కారణాలుగా విశ్లేషణలు వెలువడ్డాయి. అమెరికాలో వచ్చిన రాజకీయ మార్పు భారత్‌లోనూ అధికార పక్షానికి వ్యతిరేకంగా ప్రజాతీర్పు రావచ్చనే ఆశలను విపక్షాల్లో పెంచుతోంది.



ట్రంప్‌కు సుప్రీంకోర్టు షాక్

ఆ ఓట్ల జోలికి వెళ్లొద్దని హెచ్చరిక!

కోర్టులో వీగిన ట్రంప్ ప్రయత్నం

ఓట్ల లెక్కింపును అడ్డుకునే యత్నం

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికలకు ముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో పౌరసత్వంపై అనుమానాలున్నాయంటూ సుమారు 20 వేల మంది ఓటర్ల ఓట్లను పక్కన పెట్టాలని ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని న్యాయస్థానం తిరస్కరించింది. అమెరికా న్యాయశాఖ ఈ ఓటర్ల పౌరసత్వాన్ని పరిశీలించే వరకు వారి ఓట్ల లెక్కింపు నిలిపివేయాలని కోరింది. ఓట్లను లెక్కించే అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ట్రంప్ సైతం సోషల్ మీడియాలో స్పందిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అయితే పౌరసత్వంపై నిరూపిత ఆధారాలు లేకుండా ఓట్ల లెక్కింపును నిలిపివేయడం ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యమే అని న్యాయస్థానాలు అభిప్రాయపడ్డాయి.

అనుమానితుల జాబితాలో భారీ తప్పులు

ట్రంప్ ప్రభుత్వం హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం రూపొందించిన జాబితాను ఆధారంగా చేసుకుంది. తొలుత కాలిఫోర్నియా ఓటర్ల జాబితాలో దాదాపు 2 లక్షల మంది పౌరసత్వం లేని వారు ఉండవచ్చని పేర్కొన్న ప్రభుత్వం, అక్టోబరులో సుమారు 20 వేల పేర్లతో జాబితా సమర్పించింది. అయితే లాస్‌ఏంజెలెస్ కౌంటీ అధికారులు పరిశీలించిన 200 మంది నమూనా జాబితాలో 38.9 శాతం మందికి అమెరికాలోనే జన్మించినట్లు రికార్డులు వెల్లడించాయి. మరో 112 మందికి ఓటరు నమోదు రద్దయినట్లు లేదా క్రియాశీలంగా లేనట్లు గుర్తించారు. దీంతో ఆ జాబితా విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నెవాడాలోనూ తొలుత 16 వేల మంది అనుమానితులని పేర్కొని, పరిశీలన తర్వాత 185 మందికి కుదించారు. వారంతా అమెరికా పౌరులేనని తేలింది.

న్యాయస్థానాల్లో వరుస ఎదురుదెబ్బలు

అక్టోబర్ 28న కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఓట్లను పక్కన పెట్టాలన్న ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరించింది. ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతున్న సమయంలో ఇలాంటి చర్యలు గందరగోళానికి దారితీస్తాయని న్యాయమూర్తి డేవిడ్ కార్టర్ హెచ్చరించారు. ఆధారాలు లేని ఆరోపణలతో ఓట్లను పక్కన పెట్టడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. అనంతరం ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం కూడా అదే నిర్ణయాన్ని సమర్థించింది. నవంబర్ 2న సుప్రీంకోర్టు సైతం ట్రంప్ ప్రభుత్వ అప్పీల్ ను తిరస్కరించింది.

ఇళ్ల వద్దకు అధికారుల విచారణ

అనుమానిత ఓటర్ల గుర్తింపు కోసం ట్రంప్ ప్రభుత్వం తొమ్మిది రాష్ట్రాల్లో ఇళ్ల వద్దకు అధికారులను పంపించింది. 'అన్ లాఫుల్ ఓటర్ ఇనిషియేటివ్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సహజసిద్ధంగా జన్మించిన పౌరులు కాకుండా, పౌరసత్వం పొందిన వారిని ప్రధానంగా పరిశీలించారు. ఒక్కొక్కరిని విచారించడానికి అధికారులకు కేవలం 12 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. సరైన జాతీయ పౌరసత్వ డేటాబేస్ లేకపోవడంతో తప్పులు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని అక్టోబర్ 21న జిల్లా కోర్టు ఈ కార్యక్రమాన్ని నిలిపివేసింది. మరోవైపు సెప్టెంబర్ 25న సుప్రీంకోర్టు సేవ్ పౌరసత్వ డేటాబేస్ ను రాష్ట్రాలకు అందించేందుకు ప్రభుత్వానికి అనుమతించింది. ఇప్పటికే 27 రాష్ట్రాలు ఈ వ్యవస్థను ఉపయోగిస్తున్నాయి.

అగ్నివీరులకు రెండేళ్ల పొడిగింపు

యువత అసంతృప్తికి బీజేపీ విరుగుడు

అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు కేవలం సైనిక నియామకాలకు సంబంధించిన నిర్ణయాలే కాదు.. రాజకీయంగా కూడా కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అగ్నివీరుల సర్వీసును మరో రెండేళ్లు పొడిగించి, ఆ తర్వాత కూడా సాయుధ దళాల్లో కొనసాగించే అవకాశం కల్పించే ప్రతిపాదన ఈ సమీక్షలో భాగంగా వెలుగులోకి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ కోల్పోయి 240 స్థానాలకే పరిమితమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వచ్చింది. ముఖ్యంగా సైనిక నియామకాలు ఎక్కువగా జరిగే రాష్ట్రాల్లో బీజేపీకి ఎదురైన నష్టాలు పార్టీ నాయకత్వాన్ని ఆలోచనలో పడేశాయి. యువతలో పెరుగుతున్న అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందన్న అంచనాలు అగ్నిపథ్ సమీక్షకు ప్రధాన కారణంగా నిలిచాయి. ఎన్నికల ఫలితాల తర్వాత జనతాదళ్ (యునైటెడ్), తెలుగుదేశం పార్టీ, లోక్ జనశక్తి పార్టీ వంటి ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు అగ్నిపథ్ పథకాన్ని పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరాయి. సైన్యంలో చేరాలని ఆశిస్తున్న యువతలో తీవ్ర అసంతృప్తి ఉందని ఆ పార్టీలు స్పష్టం చేశాయి. తక్కువ కాలానికి సైనిక సేవలు అందించడం వల్ల యువతకు అవకాశాలు తగ్గుతున్నాయన్న విమర్శలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. అయితే ఈ వాదనలు రాజకీయంగా యువతను సంతృప్తిపరచలేకపోయాయి.

అగ్నిపథ్‌పై యూటర్న్

ఎన్నికల భయమే కారణమా?

పొడిగింపుపై కాంగ్రెస్ విమర్శలు

అగ్నివీరుల సర్వీసును మరో రెండేళ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా తీవ్ర విమర్శలు చేశారు. ఈ నిర్ణయం ప్రభుత్వ వైఖరిలో వచ్చిన యూటర్న్‌కు నిదర్శనమని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల భయంతోనే ఈ మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. అగ్నిపథ్ పథకాన్ని మొదటి నుంచీ కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, రాహుల్ గాంధీ కూడా ఈ విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఈ పథకం సాయుధ దళాల సామర్థ్యంతో పాటు యువత భవిష్యత్తును కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సైన్యంలో చేరాలని ఆశించే యువత సంఖ్య ఎక్కువగా ఉందని, అక్కడ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే కేంద్రం నిర్ణయం మార్చుకుందని విమర్శించారు. యువతకు భవిష్యత్తుపై భరోసా ఇవ్వకుండా రెండేళ్ల పొడిగింపుతో సమస్యను వాయిదా వేస్తున్నారని ఖేరా మండిపడ్డారు.

మోదీ దేశవ్యతిరేకి

5 నిమిషాల్లో నిరూపిస్తా!.. ముఖాముఖి చర్చకు సై.. రాహుల్ విమర్శలు

ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. కాంగ్రెస్‌ను దేశ విరోధి పార్టీగా అభివర్ణిస్తున్న మోదీ, తనతో ముఖాముఖి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. తాను కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ దేశ విరోధి అని నిరూపిస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. పంజాబ్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతూ నవంబర్ 4న నిర్వహించిన కాంగ్రెస్ ఇన్సాఫ్ ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చకు వేదిక ఎక్కడైనా సిద్ధమేనని, న్యాయనిర్ణేతగా ఎవరిని నియమించుకోవాలన్నది కూడా మోదీ ఇష్టమని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను పెట్టుకున్నా, పారిశ్రామికవేత్త అదానీని కూర్చోబెట్టినా తనకు అభ్యంతరం లేదన్నారు. మోదీ తన ఎదుట కూర్చొని చర్చకు సిద్ధపడితే ఎవరు దేశ విరోధులో ప్రజలకే తెలుస్తుందని సవాల్ విసిరారు. మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం కాకుండా బడా పారిశ్రామికవేత్త అదానీ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని రాహుల్ ఆరోపించారు. దేశంలోని భూములు, మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. రైతులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. కేబినెట్‌తో పాటు అధికారులతో చర్చించకుండానే ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి ఒప్పందంపై సంతకం చేశారని ఆరోపించారు. భారత రైతులు, పరిశ్రమలు, దేశ డేటా ప్రయోజనాలను అమెరికాకు అః



ప్రకృతి ప్రకోపం... తల్లడిల్లుతున్న ప్రజానీకం

తీరని నష్టం.. పూడ్చటం కష్టం..! పాలకులు నేర్చుకోవాలి పాఠం.. విలయాలు నేర్పుతున్న గుణపాఠం!

ప్రకృతి ప్రకోపిస్తే మనిషి ఎంతటి శక్తిమంతుడైనా ప్రకృతి ముందు బలహీనుడే. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా, ఆకాశం నుంచి విరుచుకుపడే గాలులు, సముద్రం నుంచి ఎగిసిపడే అలలు, కుండపోతగా కురిసే వర్షాల ముందు మనిషి జీవితం ఒక్కసారిగా తలకిందులవుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. మొన్న అర్నబ్ తుపాను రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తే.. దాని ప్రభావం నుంచి పూర్తిగా కోలుకోక ముందే మురసు తుపాను తీరప్రాంతాన్ని వణికించింది. ఒక విపత్తు సృష్టించిన గాయాలు మానక ముందే మరో విపత్తు విరుచుకుపడటం ప్రజల్లో ఆందోళన పెంచుతోంది. ముఖ్యంగా కోస్తాంధ్రలోని రైతులు, మత్స్యకారులు, చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. తుపాను తీరం దాటిన కొన్ని గంటల్లోనే సాధారణ జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. రహదారులపై చెట్లు కూలిపోతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. పంట పొలాలు నీట మునుగుతున్నాయి. ఇళ్లు దెబ్బతింటున్నాయి. రవాణా వ్యవస్థ నిలిచిపోతోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే తాగునీటి సరఫరా నుంచి ఆసుపత్రుల సేవల వరకు అనేక వ్యవస్థలు ప్రభావితమవుతున్నాయి. ఒక ప్రాంతంలో తుపాను బీభత్సం సృష్టిస్తుంటే, మరో ప్రాంతంలో భారీ వర్షాలు వరదలకు కారణమవుతున్నాయి. ఇది కేవలం వాతావరణ మార్పు కాదు.. ప్రజల జీవన భద్రతకు ఎదురవుతున్న సవాలు. అర్నబ్, మురసు వంటి వరుస తుపానులు ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు సహాయక చర్యలు చేపట్టడమే ప్రభుత్వాల బాధ్యతనా? లేక అవి వచ్చినా ప్రజల జీవన వ్యవస్థలు కుప్పకూలకుండా ముందుగానే రక్షణ ఏర్పాట్లు చేయాలా? విపత్తు తర్వాత నష్టాన్ని లెక్కించడం కంటే, విపత్తుకు ముందు నష్టాన్ని తగ్గించే వ్యవస్థను నిర్మించుకోవడం ఇప్పుడు అత్యవసరం.

బంగాళాఖాతంలో అలజడి.. తుపాన్లకు అసలు కారణాలేంటి?

తుపాన్లు అకస్మాత్తుగా ఆకాశం నుంచి ఊడిపడవు. వాటి వెనుక సముద్ర ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, వాతావరణ పీడనం, తేమ వంటి అనేక ప్రకృతి ప్రక్రియలు ఉంటాయి. బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు నీటి నుంచి ఎక్కువ ఆవిరి వాతావరణంలోకి చేరుతుంది. ఆ తేమతో కూడిన గాలి పైకి ఎగిసి చల్లబడినప్పుడు మేఘాలు ఏర్పడతాయి. సముద్రంపై అల్పపీడనం బలపడితే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గాలులు ఆ కేంద్రం వైపు వేగంగా కదులుతాయి. భూమి భ్రమణం వల్ల ఏర్పడే కోరియోలిస్ ప్రభావం ఈ గాలులకు భ్రమణ స్వభావాన్ని కల్పిస్తుంది. ఈ ప్రక్రియలు అనుకూలిస్తే అల్పపీడనం వాయుగుండంగా, అక్కడి నుంచి తీవ్ర తుపానుగా మారవచ్చు. సముద్రంలో లభించే వెచ్చదనం తుపానుకు ఇంధనంలా పనిచేస్తుంది. అందుకే సముద్ర ఉష్ణోగ్రతలు, వాతావరణంలోని తేమ, గాలుల పరిస్థితులు కీలకంగా మారతాయి. అయితే ప్రతి తుపానుకు వాతావరణ మార్పులే కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. వాతావరణ మార్పుల ప్రభావంతో సముద్రాలు వేడెక్కడం, వాతావరణంలో తేమ పెరగడం వల్ల కొన్ని తుపానులు మరింత తీవ్రంగా మారే అవకాశాలు ఉంటాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ముఖ్యంగా బలమైన తుపానులు భారీ వర్షాలను కురిపించే సామర్థ్యాన్ని పొందవచ్చు. తుపాను గాలుల వేగం, దాని ప్రయాణ మార్గం, తీరం దాటే ప్రాంతం, కదలిక వేగం అన్నీ నష్ట తీవ్రతను నిర్ణయిస్తాయి. ఒకే స్థాయి తుపాను రెండు ప్రాంతాల్లో ఒకే విధమైన నష్టాన్ని కలిగించదు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్రపు అలల ఎత్తు, నదుల ప్రవాహం, నేల స్వభావం కూడా ప్రభావం చూపుతాయి. అందుకే తుపానును కేవలం గాలివానగా చూడకూడదు. అది సముద్రం, వాతావరణం, భూమి మధ్య జరిగే సంక్లిష్ట ప్రక్రియ. తుపాను ఏర్పడిన తర్వాత దాని దిశను అంచనా వేయడం ఎంత ముఖ్యమో, దాని ప్రభావంతో ఎంత వర్షం పడుతుంది, ఏ ప్రాంతాల్లో వరదలు వస్తాయి, ఎంత వేగంతో గాలులు వీస్తాయి అన్నది ముందుగా గుర్తించడం కూడా అంతే ముఖ్యం.

అర్నబ్ నుంచి మురసు వరకు.. నష్టాల లెక్కలు చెబుతున్న చేదు నిజాలు!

వరుస తుపాన్ల ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో ప్రభుత్వ ప్రాథమిక అంచనాలు చూస్తే అర్థమవుతుంది. అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకిన అర్నబ్ తుపాను అనేక జిల్లాల్లో భారీ విధ్వంసం సృష్టించింది. పంటలు నీట మునిగాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ అందుబాటులో ఉంచిన ప్రాథమిక వివరాల ప్రకారం 28 జిల్లాల నుంచి అందిన నివేదికల్లో వేల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయ్. వ్యవసాయ శాఖ నివేదికల్లో సుమారు 3.51 లక్షల హెక్టార్ల పంట ప్రాంతం నీట మునిగినట్లు తేలింది. ఉద్యాన పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. అర్నబ్ సృష్టించిన నష్టం నుంచి రైతులు కోలుకోకముందే నవంబర్ 3న మురసు తుపాను ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం ప్రాంతం వద్ద తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో గాలుల వేగం మరింత ఎక్కువగా నమోదైంది. భారీ వర్షాలు పంటలను ముంచెత్తాయి. మురసు ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 52,459 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, వందల ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. వేలాది మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మరో ప్రాథమిక అంచనాలో మురసు వల్ల మొత్తం నష్టం భారీగానే నమోదవుతోంది. ఇందులో వ్యవసాయ రంగానిదే ప్రధాన వాటా. వరి, పత్తి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేలాది చెట్లు నేలకొరిగాయి. రహదారులు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయ్. మత్స్యకారుల పడవలు, తీర ప్రాంత ఆస్తులు కూడా ప్రభావితమయ్యాయి. ఈ గణాంకాలు కేవలం ప్రభుత్వ రికార్డుల్లోని సంఖ్యలు కావు.. ఒక్కో సంఖ్య వెనుక ఒక కుటుంబం, ఒక రైతు ఏడాది కష్టం, ఒక సామాన్యుడి జీవనాధారం ఉన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి దెబ్బతీయడంతో రైతుల అప్పులు, పెట్టుబడులు, కుటుంబ అవసరాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. నష్టాన్ని ప్రకటించడం ఒక ఎత్తయితే, ఆ నష్టాన్ని నిజంగా బాధితుడికి చేరే పరిహారంగా మార్చడం మరో ఎత్తు.

విద్యుత్ స్తంభం కూలితే.. ఆగేది కేవలం కరెంటేనా?

తుపాన్ల సమయంలో ప్రజలు ఎదుర్కొనే అతిపెద్ద సమస్యల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఒకటి. సాధారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, తీగలు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, సబ్‌స్టేషన్లలోకి నీరు చేరడం వంటి సమస్యలు ఎదురవుతాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇళ్లలో దీపాలు వెలగకపోవడమే కాదు, తాగునీటి మోటార్లు పని చేయవు. ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలుగుతుంది. మొబైల్ నెట్‌వర్క్‌లు, ఇంటర్నెట్ సేవలు దెబ్బతింటాయి. చిన్న వ్యాపారాలు మూతపడతాయి. శీతలీకరణ సదుపాయాలు నిలిచిపోవడంతో ఆహార పదార్థాలు పాడవుతాయి. ముఖ్యంగా ఆసుపత్రులు, తాగునీటి పథకాలు, అత్యవసర సేవలకు నిరంతర విద్యుత్ అందించడం అత్యంత కీలకం. అర్నబ్ తుపాను తర్వాత విద్యుత్ పునరుద్ధరణలో అధికారులు పెద్ద ఎత్తున శ్రమించాల్సి వచ్చింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో స్తంభాలు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టారు. మురసు తుపాను సేపథ్యంలోనూ ఇంధన శాఖ ముందుగానే అప్రమత్తమైంది. విద్యుత్ మౌలిక సదుపాయాలను కాపాడేందుకు, సరఫరా నిలిచిన ప్రాంతాల్లో వేగంగా పునరుద్ధరణ చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడినప్పుడు అది ప్రాణాంతకంగా మారుతుంది. అర్నబ్ తర్వాత విద్యుత్ ప్రమాదాల కారణంగా ప్రాణనష్టం జరిగిన ఘటనలు కూడా నమోదయ్యాయి. అందుకే తుపాను సమయంలో ప్రజలు బయటకు రావద్దని, తెగిపడిన తీగలను తాకవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే కేవలం హెచ్చరికలతో సమస్య పరిష్కారం కాదు. విద్యుత్ స్తంభాల నిర్మాణంలో తుపాను గాలులను తట్టుకునే ప్రమాణాలు ఉండాలి. తీగలను భద్రంగా అమర్చాలి. వరద ముంపునకు గురయ్యే సబ్‌స్టేషన్లను ముందుగానే గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలి. అవసరమైన చోట భూగర్భ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, మరమ్మతు సామగ్రి సిద్ధంగా ఉంచాలి. జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు ఆసుపత్రులు, నీటి సరఫరా కేంద్రాల్లో తప్పనిసరి చేయాలి. విపత్తు సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ అనేది కేవలం సాంకేతిక పని కాదు.. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, జీవనాధారాలను కాపాడే అత్యవసర బాధ్యత. అందుకే విద్యుత్ వ్యవస్థను సాధారణ పరిస్థితుల్లో ఎంత సమర్థంగా నిర్వహిస్తున్నామన్నదానికంటే, తుపాను సమయంలో ఎంతటి ఒత్తిడిని తట్టుకోగలదన్నది కీలకంగా మారాలి.

ప్రభుత్వాలు మారాలి.. ప్రకృతితో సహజీవనం నేర్చుకోవాలి!

ప్రకృతి విపత్తులను పూర్తిగా ఆపలేకపోయినా, వాటి నష్టాన్ని తగ్గించడం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. అర్నబ్, మురసు తుపానులు నేర్పుతున్న పాఠం ఇదే. తుపాను తర్వాత సహాయక శిబిరాలు, ఆహార పంపిణీ, రహదారుల మరమ్మతులు, విద్యుత్ పునరుద్ధరణతోనే విపత్తు నిర్వహణ పూర్తికాదు. ముందస్తు హెచ్చరికల నుంచి శాశ్వత పునరావాసం వరకు సమగ్ర ప్రణాళిక అవసరం. తీర ప్రాంత ప్రజలకు సకాలంలో సమాచారం చేరవేయడం, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విపత్తు బృందాలను బలోపేతం చేయడం, మత్స్యకారులకు హెచ్చరికలు అందించడం, తుపాను షెల్టర్లు, సురక్షిత రహదారులు, అత్యవసర వైద్య సదుపాయాలు పెంచాలి. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, క్షేత్రస్థాయి సర్వేలతో పంట నష్టాన్ని గుర్తించి రైతులకు తక్షణ పరిహారం అందించాలి. పంటల బీమాలో జాప్యాన్ని తొలగించి, చిన్న వ్యాపారులు, మత్స్యకారులు, ఇళ్లు కోల్పోయిన పేదలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలి. దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సహకారం అందించడంతో పాటు నష్టాల అంచనా, కేంద్ర బృందాల పరిశీలన వేగవంతం చేయాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సామర్థ్యాన్ని పెంచాలి. అదే సమయంలో మడ అడవులను కాపాడాలి. అవి సముద్ర అలల ఉద్ధృతిని తగ్గించి, తీర కోతను నియంత్రించే సహజ రక్షణ కవచాలు. అభివృద్ధి పేరుతో వాటిని నాశనం చేయడం, తీర ప్రాంతాల్లో విచ్చలవిడిగా నిర్మాణాలు చేపట్టడం భవిష్యత్తుకు ప్రమాదకరం. నదులు, కాలువలు, చెరువుల సహజ ప్రవాహ మార్గాలను కాపాడుతూ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. పట్టణ ఆక్రమణలను తొలగించి, వాతావరణ మార్పులను ఎదుర్కొనే దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించాలి. ప్రజలు కూడా హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా అత్యవసర వస్తువులు, మందులు, తాగునీరు సిద్ధం చేసుకోవాలి. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదు. అభివృద్ధి అంటే భారీ భవనాలు, రహదారులు, పరిశ్రమలు మాత్రమే కాదు.. విపత్తులు వచ్చినా ప్రజల ప్రాణాలు, ఆస్తులు, జీవనాధారాలను కాపాడే వ్యవస్థను నిర్మించడమే నిజమైన అభివృద్ధి. అర్నబ్ వెళ్లిపోయింది.. మురసు బలహీనపడింది.. కానీ అవి మిగిల్చిన నష్టాలు, కన్నీళ్లు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. రేపు మరో తుపాను వస్తే మళ్లీ ఇదే విధ్వంసం, ఇదే నష్టం, ఇదే సహాయక చర్యలు పునరావృతం కావాలా? లేక ఈ విపత్తుల నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తును సురక్షితం చేసుకోవాలా? సమాధానం ప్రభుత్వాల విధానాల్లో, ప్రజల భాగస్వామ్యంలో, పర్యావరణ పరిరక్షణలో ఉంది. ప్రకృతి హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే నష్టాన్ని భరించేది సామాన్యుడే.. ప్రకృతిని కాపాడుకుంటేనే మనిషి భవిష్యత్తు భద్రం. ఇదే అర్నబ్, మురసు తుపానులు నేర్పుతున్న అసలైన పాఠం.

– కేసానపల్లి కోటేశ్వరరావు, ఇన్‌పుట్ ఎడిటర్



ఏపీలో వర్షాల వెల్లువ.. తెలంగాణలో నీటి కటకట ఎందుకు?

ఇక్కడ మరో ఆసక్తికరమైన వాతావరణ పరిస్థితిని గమనించాలి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లో తుపాన్ల కారణంగా భారీ వర్షాలు కురుస్తుంటే, మరోవైపు తెలంగాణలో కొన్ని ప్రాంతాలు వర్షాభావం, నీటి కొరత ఆందోళనను ఎదుర్కొంటున్నాయి. ఒకే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంత భిన్నమైన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? దీనికి ప్రధాన కారణం వర్షపాతం పంపిణీలో ఉన్న అసమానత. వర్షం పడటం ఒక అంశమైతే, అది ఎక్కడ, ఎప్పుడు, ఎంత విస్తీర్ణంలో పడుతుందన్నది మరో అంశం. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడ నాలు, వాయుగుండాలు తీరాంధ్రలోని కొన్ని జిల్లాల కు భారీ వర్షాలను తీసుకొస్తాయి. కానీ వాటి ప్రభావ ం తెలంగాణ అంతటా ఒకేలా ఉండదు. తుపాను ప్రయాణ మార్గం, గాలుల దిశ, పశ్చిమ దిశగా కదిలే వేగం, పర్వత ప్రాంతాల ప్రభావం వర్షపాతాన్ని నిర్ణ యిస్తాయి. మరోవైపు ఎల్‌నినో పరిస్థితులు భారత రుతుపవనాలపై ప్రభావం చూపుతాయి. పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరిగినప్పుడు ఎల్‌నినో ఏర్పడుతుంది. ఇది భారత దేశంలో నైరుతి రుతుపవనాల బలహీనతకు దారితీసే అవకాశం ఉంది. అయితే ఎల్‌నినో ఉన్న ప్రతిసారీ దేశమంతటా కరువు వస్తుందని భావించకూడదు. భారత వాతావరణ శాఖ 2026 నైరుతి రుతుపవ నాలకు సంబంధించి దీర్ఘకాల సగటులో 92 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఏప్రిల్‌లో అంచనా వేసింది. అంటే దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే పరిస్థితి ఉండవచ్చని ముందే హెచ్చరించింది. సెప్టెంబర్‌లో తెలంగాణలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోద య్యే అవకాశాన్ని వాతావరణ శాఖ ప్రస్తావించింది. అయితే బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు ఆంధ్ర ప్రదేశ్‌లో భారీ వర్షాలను కురిపించడం ఈ పరిస్థితికి విరుద్ధం కాదు. ఎందుకంటే రుతుపవనాల వర్ష పాతం, తుపాను వల్ల వచ్చే వర్షాలు రెండూ ఒకే వాతావరణ ప్రక్రియ కావు. కొన్ని జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిసినా, మరికొన్ని ప్రాంతాల్లో చినుకు పడకపోవచ్చు. భారీ వర్షం పడిన ప్రాంతంలో కూడా భూగర్భ జలాలు వెంటనే పెరుగుతాయని చెప్పలేం. నీరు వేగంగా సముద్రంలోకి వెళ్లిపోవచ్చు. చెరువులు, కుంటలు, జలాశయాల్లో నిల్వ చేసుకోలేకపోతే ఆ వర్షం భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడదు. ఒక ప్రాంతానికి వరద ముప్పు.. మరో ప్రాంతానికి కరువు ముప్పు.. రెండూ ఒకే వాతావరణ వ్యవస్థలో కనిపించే విభిన్న పరిణామాలు. కాబట్టి రాష్ట్రాలు వర్షపాతం మొత్తాన్ని మాత్రమే కాకుండా, దాని ప్రాంతీయ పంపిణీని కూడా పరిగణనలోకి తీసుకుని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలి.



ఆర్టీఐ సమాచారం.. అప్లై చేస్తే గ్రహచారం

సమాచార కమిషన్ సన్నాయి నొక్కులు

సమాచారం కోరితే తప్పని తిప్పలు

కమీషనర్లకు లక్షల్లో శాలరీ

పారదర్శకతపై కనిపించని జవాబుదారి

అధికారాలున్నాయి.. ఆదేశాలిచ్చే అధికారం ఉంది.. భారీ వేతనాలు తీసుకునే కమిషనర్లు ఉన్నారు.. కార్యాలయాలు, సిబ్బంది ఉన్నారు. అయినా ప్రజలకు సమాచారం అందించడంలో ఇన్ని అవరోధాలెందుకు? అవినీతి, అక్రమాలను వెలికితీయాల్సిన సమాచార హక్కు చట్టానికే దిక్కులేకుండా పోతోందా? 14,434 కేసులు పరిష్కరించామని గొప్పగా ప్రకటించుకుంటున్న తెలంగాణ సమాచార కమిషన్.. మరి 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల సంగతేంటి? ఐదు నెలల్లో 10,394 నోటీసులు జారీ చేస్తే వెబ్‌సైట్‌లో కనిపిస్తున్న నిర్ణయాలు 5,117 మాత్రమే ఎందుకు? తీర్పులిచ్చిన తర్వాత వాటి కాపీలు అందించడానికి నెలల సమయం ఎందుకు పడుతోంది? ఆరు నెలల రికార్డులే ప్రజలకు అందుబాటులో ఉంటే మిగతా చరిత్రను దాచిపెట్టాల్సిన అవసరమేమిటి? వేతనంగా లక్షల తీసుకుంటున్న కమిషనర్లు ప్రజలకు అందిస్తున్న సేవలేమిటి? ప్రభుత్వ సహకారం లేదా.. అధికారుల నిర్లక్ష్యమా.. వ్యవస్థలో సమన్వయ లోపమా? అసలు తప్పెక్కడ జరుగుతోంది? సమాచార హక్కును కాపాడాల్సిన కమిషనే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తే సామాన్యుడికి న్యాయం చేసేది ఎవరు? కేసుల పరిష్కారమే కాదు.. ప్రజలకు జవాబుదారీతనం చూపించండి! తెలంగాణ సమాచార కమిషన్ పనితీరుపై ఆర్టీఐ కార్యకర్తలు సంధిస్తున్న ప్రశ్నల వెనుక అసలు వాస్తవాలేమిటో చూద్దాం!

14,434 కేసులు పరిష్కరించామంటున్న తెలంగాణ సమాచార కమిషన్.. మరి 2022లో దాఖలైన ఫిర్యాదులు, అప్పీల్లు ఎందుకు ఇంకా విచారణలోనే ఉన్నాయ్..? ఎందుకు పక్కనబెట్టారు..? ఆరు నెలల రికార్డులే వెబ్‌సైట్‌లో కనిపిస్తుంటే మిగతా కేసుల వివరాలు ఎక్కడ? నోటీసులు వేలల్లో జారీ అవుతున్నా తీర్పుల అప్‌లోడింగ్‌లో సగానికి పైగా వ్యత్యాసం ఎందుకు? నిర్ణయాలు వెలువడిన తర్వాత కూడా వాటి కాపీల కోసం దరఖాస్తుదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి ఎందుకు? సమాచార హక్కును కాపాడాల్సిన కమిషన్ తన బాధ్యతలను ఎంతవరకు నిర్వర్తిస్తోంది? అధికారాలు ఉన్నాయి.. అధికారులు ఉన్నారు.. సిబ్బంది ఉన్నారు.. ప్రభుత్వ వ్యవస్థ అందుబాటులో ఉంది. అయినా ప్రజలకు సమాచారం అందించడంలో ఇన్ని అడ్డంకులెందుకు? నెలకు లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న సమాచార కమిషనర్లు ప్రజలకు అందిస్తున్న సేవలేమిటి? అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకురావాల్సిన వ్యవస్థే నత్తనడకన సాగితే సామాన్యుడికి న్యాయం చేసేది ఎవరు? తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఏర్పాటై ఏడాదిన్నర సమీపిస్తున్న తరుణంలో దాని పనితీరుపై ఆర్టీఐ కార్యకర్తలు సంధిస్తున్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కేసుల పరిష్కారంపై కమిషన్ ప్రకటిస్తున్న గణాంకాలు ఒకవైపు కనిపిస్తుంటే, క్షేత్రస్థాయిలో అప్పీలుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరోవైపు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం కేసులు పరిష్కరించామని ప్రకటించుకోవడం కాకుండా, ఆ పరిష్కారాల ఫలితాలు ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయో వివరించాల్సిన అవసరం ఉంది. సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకతకు మార్గదర్శకంగా నిలవాల్సిన కమిషన్ తన వ్యవహారాల్లోనే పూర్తి పారదర్శకత పాటించకపోతే ప్రజల్లో విశ్వాసం ఎలా పెరుగుతుంది? ప్రజలకు జవాబుదారీతనం నేర్పాల్సిన సంస్థ ముందుగా తన జవాబుదారీతనాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం లేదా? ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

కేసుల పరిష్కారంపై ప్రకటనలు.. పెండింగ్‌పై మౌనం!

తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ 2025 మేలో ఏర్పాటైన తర్వాత 2026 మే వరకు 14,434 కేసులు పరిష్కరించామని, నెలకు సగటున 1,200 కేసుల చొప్పున పరిష్కరిస్తున్నామని ప్రకటించింది. 2014 నుంచి 2021 వరకు దాఖలైన సుమారు 1,100 పాత కేసులను కూడా పరిష్కరించినట్లు వెల్లడించింది. ఈ గణాంకాలు ఆశాజనకంగా కనిపిస్తున్నా అసలు ప్రశ్నలకు సమాధానం కావడం లేదు. 2022లో దాఖలైన ఫిర్యాదులు, రెండో అప్పీళ్లు ఎన్ని? వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? 2023, 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన కేసుల పరిస్థితి ఏమిటి? సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 18(1) కింద వచ్చిన ఫిర్యాదులు, సెక్షన్ 19(3) కింద నమోదైన రెండో అప్పీళ్ల వివరాలను విడివిడిగా ప్రకటించాలని ఆర్టీఐ కార్యకర్తలు కోరుతున్నారు. పాత కేసులు పరిష్కరించడం అభినందనీయమే. అయితే, కొత్తగా నమోదవుతున్న కేసుల పరిష్కార వేగం, పెండింగ్ తగ్గుదలపై కూడా స్పష్టత ఇవ్వాలి. పాత కేసులు తగ్గుతుంటే కొత్తవి పేరుకుపోతున్నాయా? కేసుల పరిష్కారానికి సగటున ఎంత సమయం పడుతోంది? అత్యంత పాత పెండింగ్ కేసు ఎప్పుడు దాఖలైంది? విచారణ కోసం ఎంతమంది ఎదురుచూస్తున్నారు? అన్న వివరాలు వెల్లడించాలి. 14,434 కేసులు పరిష్కరించామని ప్రకటించుకోవడం మాత్రమే పనితీరుకు కొలమానం కాదు.. మిగిలిన కేసులకు ఎప్పుడు న్యాయం జరుగుతుందన్నదే అసలైన ప్రశ్న. ప్రజలకు సమాచారం అందించాల్సిన సంస్థ తన వద్ద ఉన్న కేసుల వివరాలనే వెల్లడించలేకపోతే పారదర్శకతకు అర్థమేమిటి? కమిషన్ ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి.

నోటీసులు 10,394..
నిర్ణయాలు 5,117 మాత్రమే!

తెలంగాణ సమాచార కమిషన్ వెబ్‌సైట్‌లోని 2026 జూన్ నుంచి అక్టోబర్ వరకు గణాంకాలను పరిశీలిస్తే నోటీసుల జారీకి, నిర్ణయాల అప్‌లోడింగ్‌కు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. జూన్‌లో 1,786 నోటీసులకు 1,356 నిర్ణయాలు, జూలైలో 2,067 నోటీసులకు 1,500 నిర్ణయాలు, ఆగస్టులో 2,014 నోటీసులకు 1,083 నిర్ణయాలు, సెప్టెంబర్‌లో 2,086 నోటీసులకు 995 నిర్ణయాలు అప్‌లోడ్ అయ్యాయి. అక్టోబర్‌లో 2,441 నోటీసులు జారీ కాగా కేవలం 183 నిర్ణయాలే వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నాయి. ఈ ఐదు నెలల్లో మొత్తం 10,394 నోటీసులు జారీ చేస్తే అప్‌లోడ్ చేసిన నిర్ణయాలు 5,117 మాత్రమే. అయితే, నోటీసులు, తుది నిర్ణయాలు ఒకే ప్రక్రియకు సంబంధించినవి కావు. నోటీసు జారీ చేసిన వెంటనే తీర్పు రావాల్సిన అవసరం లేదు. విచారణలు, వాదనలు, తదుపరి తేదీలు ఉంటాయి. కాబట్టి ఈ వ్యత్యాసాన్ని నేరుగా పెండింగ్ తీర్పులుగా పరిగణించలేం. అయినప్పటికీ, ఇంత భారీ తేడాకు కారణాలేమిటో కమిషన్ వివరించాలి. నెలవారీగా ఎన్ని విచారణలు జరిగాయి? ఎన్ని కేసుల్లో తుది నిర్ణయాలు వెలువడ్డాయి? వాటిలో ఎన్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ అయ్యాయి? మిగిలినవి ఎందుకు అందుబాటులో లేవు? అక్టోబర్‌లో నిర్ణయాల అప్‌లోడింగ్ 183కు పడిపోవడానికి కారణమేమిటి? అన్నది స్పష్టం చేయాలి. ప్రజలకు కనిపిస్తున్న గణాంకాలే కమిషన్ పనితీరును అంచనా వేయడానికి ప్రధాన ఆధారాలు. వాటిలోనే పూర్తి వివరాలు లేకపోతే వ్యవస్థను ఎలా పర్యవేక్షించగలరు? వెలువడిన ప్రతి నిర్ణయాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో ప్రచురించి, నెలవారీ నోటీసులు, విచారణలు, తీర్పులు, పెండింగ్ కేసుల వివరాలను ఒకేచోట అందుబాటులో ఉంచాలి. అప్పుడే అప్పీలుదారులకు తమ కేసుల స్థితి తెలుస్తుంది.. కమిషన్ పనితీరుపై ప్రజలకు స్పష్టత వస్తుంది. ఈ గణాంకాల మధ్య వ్యత్యాసంపై అధికారిక వివరణ ఇవ్వాలని ఆర్టీఐ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరు నెలల రికార్డులేనా.. పాత కేసుల వివరాలేవీ?

సమాచార హక్కు చట్టం ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత పెంచడం, అధికారుల నిర్ణయాలు, ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, ప్రజాధన వినియోగంపై పౌరులకు సమాచారం అందించడం. అలాంటి లక్ష్యంతో ఏర్పాటైన సమాచార కమిషన్ తన వెబ్‌సైట్‌లో పూర్తి రికార్డులను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఉంది. కానీ తెలంగాణ సమాచార కమిషన్ వెబ్‌సైట్‌లో పాత నోటీసులు, విచారణ తేదీలు, కేసులవారీ నిర్ణయాలు పూర్తిస్థాయిలో కనిపించడం లేదని, ముఖ్యంగా ఆరు నెలల రికార్డులకే పరిమితమైందని ఆర్టీఐ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాత కేసుల వివరాలు, విచారణ తేదీలు, ఆదేశాలు, తీర్పుల కాపీలు అందుబాటులో లేక అప్పీలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుల్ బెంచ్ విచారణ నోటీసులు, తేదీలు, నిర్ణయాల పూర్తి వివరాలు ఎందుకు ప్రచురించడం లేదు? తమ కేసు ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి ప్రజలు మళ్లీ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలి? ఇవి సాధారణ ప్రశ్నలు కావు.. పారదర్శకతకు సంబంధించిన కీలక అంశాలు. వెబ్‌సైట్ కేవలం సంస్థ పరిచయం, అధికారుల పేర్లు, ప్రకటనలకే పరిమితం కాకుండా సమగ్ర సమాచార కేంద్రంగా ఉండాలి. ప్రతి కేసుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, దాఖలు తేదీ, విచారణ తేదీలు, నోటీసులు, తుది నిర్ణయం, ఆదేశాల అమలు స్థితి అందుబాటులో ఉంచాలి. పాత రికార్డులను భద్రపరిచి, ఫుల్ బెంచ్ వివరాలతో సహా ప్రజలకు అందుబాటులోకి తేవాలి. తమ కేసు వివరాల కోసం కూడా అప్పీలుదారులు మళ్లీ ఆర్టీఐ దరఖాస్తు చేయాల్సి వస్తే వ్యవస్థలోని లోపం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు పాత రికార్డులను డిజిటలైజ్ చేయడం పెద్ద సమస్య కాకూడదు. రికార్డుల లభ్యతే పారదర్శకతకు పునాది. తెలంగాణ సమాచార కమిషన్ ఈ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలి.

తీర్పులు ఇచ్చినా.. కాపీలు చేరేది ఎప్పుడు?

తెలంగాణ సమాచార కమిషన్ పనితీరుపై మరో తీవ్రమైన అభ్యంతరం తీర్పుల కాపీలు అప్పీలుదారులకు చేరడంలో జరుగుతున్న జాప్యం. విచారణ అనంతరం కమిషన్ నిర్ణయం వెలువరించి, సంబంధిత ప్రజా సమాచార అధికారికి తీర్పు కాపీ అందిన 15 రోజుల్లో దరఖాస్తుదారునికి కోరిన సమాచారం ఇవ్వాలని ఆదేశిస్తోంది. కానీ ఆ తీర్పు కాపీ కోసమే అప్పీలుదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సి రావడం ఎందుకు? తీర్పు వెలువడిన వెంటనే కాపీ పంపాల్సిన బాధ్యత ఎవరిది? కొన్నిసార్లు కాపీ కోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? మరోవైపు, తీర్పు కాపీ ఆలస్యంగా అందిందని, అందుకే సమాచారం ఇవ్వలేకపోయామని కొందరు ప్రజా సమాచార అధికారులు చెబుతున్నారనే ఆరోపణలున్నాయి. కమిషన్ కాపీ పంపడంలో జాప్యం చేయడం ఒకవైపు.. కాపీ అందలేదనే కారణంతో అధికారులు సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేయడం మరోవైపు.. చివరకు నష్టపోతున్నది సామాన్య దరఖాస్తుదారుడే. తీర్పు ఇచ్చామని చెప్పుకోవడం కాదు.. అది సంబంధిత వ్యక్తికి చేరిందా? ఆదేశాలు అమలయ్యాయా? కోరిన సమాచారం అందిందా? అన్నదీ కమిషన్ పర్యవేక్షించాలి. తీర్పు వెలువడిన తేదీ, కాపీ సిద్ధమైన తేదీ, పంపిన తేదీ, అప్పీలుదారునికి చేరిన తేదీలను డిజిటల్ రికార్డులో నమోదు చేయాలి. కాపీల పంపిణీకి గడువు విధించి, జాప్యానికి కారణాలు వెల్లడించాలి. అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. తీర్పు ఇవ్వడం ఎంత ముఖ్యమో.. దాన్ని అమలు చేయించడం కూడా అంతే ముఖ్యం. కాపీ కోసం బాధితులు మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు. న్యాయం ఆలస్యమైతే దాని ప్రయోజనం తగ్గిపోతుంది. సమాచార హక్కు ద్వారా పొందాల్సిన సమాచారం కూడా నెలల తరబడి అందకపోతే చట్టం అసలు ఉద్దేశమే దెబ్బతింటుంది.

అవగాహన కార్యక్రమాలే కాదు.. ఫలితాలూ కావాలి!

సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తెలంగాణ సమాచార కమిషన్ హైదరాబాద్‌తో పాటు మరో 20 జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించామని, 10,000 మందికి పైగా పాల్గొన్నారని ప్రకటించింది. ప్రధాన సమాచార కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు బొడ్డి అయోధ్య రెడ్డి, పి.వి. శ్రీనివాసరావు, దేశాల భూపాల్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి కమిషన్ కార్యకలాపాలను వివరించినట్లు తెలుస్తోంది. ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించడం స్వాగతించదగినదే. సమాచారాన్ని ఎలా కోరాలి? అధికారులు స్పందించకపోతే ఎక్కడ ఫిర్యాదు చేయాలి? మొదటి, రెండో అప్పీళ్లు ఎలా దాఖలు చేయాలి? అన్న విషయాలు గ్రామీణ, పట్టణ ప్రజలకు తెలియాలి. అయితే, అవగాహన కార్యక్రమాలే విజయానికి కొలమానం కావు. వాటి ద్వారా ఎంతమంది చట్టాన్ని వినియోగించుకున్నారు? ఎన్ని కొత్త దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని అప్పీళ్లు పరిష్కారమయ్యాయి? ప్రజలకు సమాచారం అందడంలో ఎంత మార్పు వచ్చింది? అన్న వివరాలు కూడా వెల్లడించాలి. ముందుగా కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించాలి. సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న కేసులకు తీర్పులివ్వాలి. నిర్ణయాలను వెబ్‌సైట్‌లో ప్రచురించి, అప్పీలుదారులకు కాపీలు సకాలంలో పంపాలి. అధికారుల నిర్లక్ష్యంతోసమాచారం అందకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. సిబ్బంది, కార్యాలయ సౌకర్యాలు, సాంకేతిక వ్యవస్థల్లో లోపాలున్నా, విచారణలకు లేదా పనితీరుకు ఆటంకాలున్నా, ప్రభుత్వ సహకారం అవసరమైనా వాటిని బహిరంగంగా వెల్లడించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. అధికారులున్నప్పుడు బాధ్యత ఉండాలి.. వనరులున్నప్పుడు ఫలితాలు కనిపించాలి. ప్రజల హక్కులను కాపాడాల్సిన సంస్థ తన పనితీరుపై వచ్చే ప్రశ్నలకు మౌనంగా ఉండటం సరికాదు. ప్రచార కార్యక్రమాలకు ఇచ్చే ప్రాధాన్యంతోనే పెండింగ్ కేసుల పరిష్కారానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలకు అవగాహన కల్పించడమే కాదు.. వారు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించి, చట్టం లక్ష్యాన్ని ఆచరణలో నెరవేర్చడమే సమాచార కమిషన్ అసలైన విజయంగా నిలుస్తుంది.

సమగ్ర నివేదిక విడుదల చేయాలి.. జవాబుదారీతనం నిరూపించాలి!

తెలంగాణ సమాచార కమిషన్ తన పనితీరుపై నెలవారీ, సంవత్సరాలవారీ సమగ్ర నివేదికను తక్షణమే విడుదల చేయాలని ఆర్టీఐ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. సెక్షన్ 18(1) కింద వచ్చిన ఫిర్యాదులు, సెక్షన్ 19(3) కింద నమోదైన రెండో అప్పీళ్ల స్వీకరణ, పరిష్కార వివరాలను విడివిడిగా ప్రకటించాలి. ముఖ్యంగా 2022లో దాఖలైన పెండింగ్ కేసుల కచ్చితమైన సంఖ్యతో పాటు 2023, 2024, 2025, 2026 సంవత్సరాలవారీగా నమోదైన కేసులు, పరిష్కారాలు, పెండింగ్ వివరాలు వెల్లడించాలి. అత్యంత పాత కేసుల దాఖలు తేదీలు, జాప్యానికి కారణాలు, నెలవారీ నోటీసులు, విచారణలు, తుది నిర్ణయాల గణాంకాలను అందుబాటులో ఉంచాలి. ఫుల్ బెంచ్ నోటీసులు, విచారణ తేదీలు, నిర్ణయాల పూర్తి చారిత్రక రికార్డులను వెబ్‌సైట్‌లో ప్రచురించాలి. తీర్పుల కాపీలు వెలువడిన తేదీలు, అప్పీలుదారులకు పంపిన తేదీలు, పంపిణీలో జాప్యానికి కారణాలు, బాధ్యుల వివరాలు వెల్లడించాలి. కమిషన్ ఆదేశాలను ప్రజా సమాచార అధికారులు ఎంతవరకు అమలు చేశారు? ఎంతమందికి సమాచారం అందింది? ఇంకా ఎన్ని కేసుల్లో ఆదేశాల అమలు పెండింగ్‌లో ఉంది? అనే వివరాలతో పాటు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ఆన్‌లైన్ కేసు ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నెలకు లక్షల్లో వేతనాలు పొందుతున్న సమాచార కమిషనర్ల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రశ్నలు రావడం సహజం. వేతనం ఒక్కటే పనితీరుకు కొలమానం కాకపోయినా, ప్రజాధనంతో నడిచే సంస్థగా సమర్థతను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉంది. అధికారాలు, నిర్ణయాధికారం, చట్టబద్ధమైన బాధ్యతలు ఉన్నప్పుడు పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం ఎందుకు? తీర్పుల కాపీల పంపిణీలో సమస్యలేమిటి? వెబ్‌సైట్‌లో పూర్తి రికార్డులు ఎందుకు లేవు? ప్రభుత్వ సహకారం అవసరమైతే ఏ అంశాల్లో కావాలి? అన్న ప్రశ్నలకు కమిషన్ బహిరంగంగా సమాధానం చెప్పాలి. సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాల్సిన సంస్థే తన పనితీరుపై సమాచారాన్ని అందించకపోతే పారదర్శకతకు అర్థమేమిటి? అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే ప్రజల ఆయుధమైన సమాచార హక్కును పదును పెట్టాల్సిన కమిషనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జవాబుదారీతనం ఎలా బలపడుతుంది? ఏడాదిన్నరలో సాధించిన పురోగతి, ప్రజలకు అందించిన న్యాయం, ఇంకా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న కేసుల సంఖ్యను స్పష్టంగా ప్రకటించాలి. 14,434 కేసులు పరిష్కరించామని చెప్పుకోవడం కంటే, మిగిలిన ప్రతి కేసుకు సకాలంలో న్యాయం అందించడమే ముఖ్యం. హక్కులను కాపాడాల్సిన సంస్థే మౌనంగా ఉంటే ప్రజలు గొంతుకగా నిలిచేది ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానమిస్తూ తెలంగాణ సమాచార కమిషన్ తన జవాబుదారీతనాన్ని నిరూపించుకోవాలి.





సాహితీ మహారథి దాశరథి

నేడు దాశరథి వర్ధంతి

"నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి..." ఓ నిజాము పిశాచమా? కానరాడు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' అని ఆయన నినదించారు. 'ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. 'అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం అనాథునికీ అగర్భ శ్రీమంతునికీ మధ్య' అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. "మా నిజాం రాజు జన్మజన్మల బూజు".రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్' అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. "అగ్ని ధారను తన జైలు సహవాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. 'కవితా పుష్పకం' అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి 'బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును' రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు. రుద్రవీణ, మహాంధ్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం). మస్తిష్కంలో లేబరేటరీ (విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది-దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన 'వాగ్దానం' చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. 'నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాలు గెలువనీరా' అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన 'ఇద్దరు మిత్రులు' సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి 'నవమి'. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు."జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే.." అన్నారాయన. అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు... అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు/నా తెలంగాణ కోటి రత్నాల వీణ."(అగ్నిధార) ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి.... తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే". కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును.."అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం/అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య". ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి / ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి"...గతాన్ని కాదనలేను-వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను – కాలం నాకంఠమాల".. హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్"... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఆపన్నులకు అండగా... రెడ్ క్రాస్ సంస్థ

నేడు భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన దినం

రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ దునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు దునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. గాయపడిన వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863 లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ దునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ దునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ దునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ.



తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి. 1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా – టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విట్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌గ్రౌండ్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది. రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (×జ=జ), అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య (×ఖీ=జ), స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థ లన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 నవంబర్లో 5న స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది.

ఐఆర్‌సిఎస్ 1920 లో స్వచ్ఛంద మానవతా సంస్థగా స్థాపించబడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,100 కి పైగా శాఖల నెట్‌వర్క్‌తో, ఇది విపత్తులు , అత్యవసర సమయాల్లో సహాయం అందిస్తోంది, అలాగే పేదలు, బలహీనుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్వతంత్ర మానవతా సంస్థ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ , రెడ్ క్రెసెంట్ ఉద్యమంలో ప్రముఖ సభ్యసంస్థ. భారత రెడ్‌క్రాస్ మిషన్ అన్ని రకాల మానవతా కార్యకలాపాలను చేపట్టడం, ప్రోత్సహించడం చేస్తోంది.. మానవాళి బాధలను తగ్గించవచ్చు , నివారించవచ్చు తద్వారా శాంతికి మరింత సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదం చేస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

'సునామీ'లపై అవగాహన అవసరం

నేడు ప్రపంచ సునామీ అవగాహన దినం

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5--6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు



కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్‌వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢవిల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఆక్లాండ్‌లో 'కింగ్' కోహ్లీ విధ్వంసం!

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

- ఐదు వికెట్ల తేడాతో కివీస్‌ను మట్టికరిపించిన టీమిండియా
- 51 బంతుల్లోనే 74 పరుగులు.. విరాట్ మెరుపు ఇన్నింగ్స్
- వర్షంతో మారిన లక్ష్యం.. 32 ఓవర్లలో 143 పరుగుల ఛేదన
- బౌలింగ్‌లో అర్ష్‌దీప్, గుర్నూర్, అన్షుల్ సత్తా
- మరో 56 బంతులు మిగిలి ఉండగానే విజయం.. సిరీస్‌లో 1-0 ఆధిక్యం



ఆక్లాండ్, నవంబర్ 4 : న్యూజిలాండ్ గడ్డపై భారత జట్టు విజయంతో వన్డే సిరీస్‌ను ప్రారంభించింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా బుధవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఆతిథ్య న్యూజిలాండ్‌ను ఓడించింది. భారత బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయగా, పరుగుల ఛేదనలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగిపోయాడు. కేవలం 51 బంతుల్లో 74 పరుగులు చేసి భారత విజయానికి బాటలు వేశాడు. వర్షం కారణంగా డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించగా, టీమిండియా 22.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు భారత పేసర్లు ఆరంభం నుంచే సవాల్ విసిరారు. అర్ష్‌దీప్ సింగ్ తన పదునైన బౌలింగ్‌తో ఓపెనర్లు విల్ యంగ్ (9), హెన్రీ నికోల్స్ (9)లను త్వరగానే పెవిలియన్‌కు పంపించాడు. దీంతో ఆతిథ్య జట్టు ఆరంభంలోనే ఒత్తిడిలో పడింది. టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30), డారిల్ మిచెల్ (28) కొంతసేపు ప్రతిఘటించినప్పటికీ భారీ భాగస్వామ్యాలను నెలకొల్పలేకపోయారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ కివీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టగా, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో రాణించాడు. అన్షుల్ కంబోజ్ కేవలం 22 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు సాధించాడు. చివర్లో బ్లెయిర్ టిక్నర్ (34), జాకబ్ డఫీ (15 నాటౌట్) పోరాడటంతో న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఖాతా తెరవకుండానే కైల్ జేమీసన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దీంతో భారత శిబిరంలో కాసేపు ఆందోళన నెలకొంది. అయితే క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఒకవైపు గిల్ నిలకడగా ఆడుతుండగా, మరోవైపు కోహ్లీ కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించడంతో భారత్ లక్ష్యాన్ని డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో 143 పరుగులకు సవరించారు. అనంతరం కోహ్లీ తన దూకుడును మరింత పెంచాడు. గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ ఈ మ్యాచ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూజిలాండ్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మైదానం నలువైపులా బౌండరీలు బాదాడు. కేవలం 51 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు సాధించాడు. వన్డే క్రికెట్‌లో తన అనుభవాన్ని ప్రదర్శిస్తూనే పొట్టి క్రికెట్ తరహాలో దూకుడుగా ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేసి కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. కోహ్లీ, గిల్ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే చివరి దశలో జాకబ్ డఫీ బౌలింగ్‌లో కోహ్లీ, అక్షర్ పటేల్ వెంటవెంటనే అవుటవడంతో కాసేపు ఉత్కంఠ నెలకొంది. శ్రేయస్ అయ్యర్ 15 పరుగులు చేయగా, కేఎల్ రాహుల్ (3 నాటౌట్), నమన్ ధీర్ (5 నాటౌట్) మిగిలిన పరుగులు సాధించి విజయాన్ని పూర్తి చేశారు. బౌలింగ్‌లో సమష్టి ప్రదర్శన, బ్యాటింగ్‌లో కోహ్లీ దూకుడుతో భారత్ తొలి వన్డేలోనే పైచేయి సాధించింది. ముఖ్యంగా ప్రత్యర్థిని 185 పరుగులకే పరిమితం చేయడంలో భారత పేసర్లు కీలక పాత్ర పోషించారు. వర్షం కారణంగా లక్ష్యం మారినప్పటికీ భారత బ్యాటర్లు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఛేదనను పూర్తి చేశారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లోనే అద్భుత ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు.



యూత్ ఒలింపిక్స్‌లో చారిత్రాత్మక కాంస్యం

స్విమ్మింగ్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన యువ సంచలనం!

బెంగళూరు/న్యూఢిల్లీ, నవంబర్ 4 : అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు చారిత్రాత్మక కాంస్య పతకంతో దేశ కీర్తిపతాకాన్ని ఎగురవేసింది. సెనెగల్‌లోని డాకర్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న యూత్ ఒలింపిక్స్ ఈవెంట్‌లో బెంగళూరుకు చెందిన 16 ఏండ్ల ఈ యువ సంచలనం అద్భుతమైన ప్రదర్శనతో మెరిసింది. స్విమ్మింగ్ విభాగంలో భారత క్రీడా చరిత్రలోనే తొలిసారిగా యూత్ ఒలింపిక్స్ పతకాన్ని అందించి సరికొత్త రికార్డు సృష్టించింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్ కేటగిరీలో తీవ్ర పోటీని తట్టుకుని నిలిచిన ధినిధి దేశింగు, నిర్ణీత లక్ష్యాన్ని కేవలం 56.27 సెకన్లలోనే పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ఈ నూతన టైమింగ్‌తో పతకంతో పాటు జాతీయ రికార్డును కూడా తన పేరిట లిఖించుకుంది. గతంలో ఏ భారతీయ ఈతగాడికీ సాధ్యంకాని ఈ అరుదైన ఘనతను సాధించి అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను చాటిచెప్పింది. ఈ చారిత్రాత్మక పతక సాధనపై భారత్ వ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ధినిధి దేశింగు శిక్షణ, వికాసానికి అండగా నిలుస్తున్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ గ్రూప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మనవ్ మియాన్‌వాల్ మాట్లాడుతూ.. ధినిధి సాధించిన ఈ విజయం దేశానికే గర్వకారణమని కొనియాడారు. క్రీడల్లో రాణించాలనుకునే వేలాది మంది యువ ప్రతిభావంతులకు ఈ విజయం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులోనూ ఆమెకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

నచ్చిన ఆటగాళ్లను ఎంచుకోలేకపోయా

టీమిండియాపై సచిన్ ఆసక్తికర వ్యాఖ్యలు!

న్యూఢిల్లీ, నవంబర్ 4 : క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ భారత జట్టు నాయకత్వ బాధ్యతలు, తన కెప్టెన్సీ రోజుల నాటి పరిస్థితులపై ఆసక్తిక ర విషయాలను పంచుకున్నారు. రెడ్డిట్ సామాజిక మాధ్యమం వేదికగా నిర్వహించిన ప్రత్యేక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తన ఫేవరెట్ కెప్టెన్లు ఎవరో వెల్లడించడంతో పాటు భారత కెప్టెన్‌గా పనిచేసిన రోజుల్లో ఎదురైన సవాళ్లను గుర్తుచేసుకున్నారు.టీమిండియా మాజీ సారథులు సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీలు తన ఫేవరెట్ కెప్టెన్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని సచిన్ స్పష్టం చేశారు. సౌరవ్ గంగూలీ నాయకత్వంలో 2003 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఆడిన సచిన్, ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2011లో స్వదేశంలో ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడారు. ఈ ఇద్దరు నాయకులతో కలిసి ఆడిన అనుభవం తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత దక్షిణాఫ్రికా టెస్టు కెప్టెన్ టెంబా బవుమా నాయకత్వ పటిమను, స్ఫూర్తిని సచిన్ ప్రత్యేకంగా ప్రశంసించారు. బవుమా ముందుండి జట్టును నడిపిస్తూ దక్షిణాఫ్రికాకు అద్భుత విజయాలు అందిస్తున్నారని, దక్షిణాఫ్రికా జట్టు ఐసీసీ టైటిల్ గెలవడం ప్రపంచ క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీ అనుభవం గురించి మాట్లాడుతూ.. భారత జట్టుకు నాయకత్వం వహించడం ఒక గొప్ప గౌరవంగా భావిస్తానని, అయితే ఆ రోజుల్లో తనకు నచ్చిన ఆటగాళ్లను పూర్తిగా స్వేచ్ఛగా జట్టులోకి ఎంపిక చేసుకునే అవకాశం ఎప్పుడూ లభించలేదని బాహాటంగా చెప్పారు. 1990వ దశకంలో బీసీసీఐ నాటి పరిస్థితులతో పోలిస్తే, ప్రస్తుతం ఎంతో వృత్తిపరమైన వ్యవస్థగా రూపాంతరం చెందిందని సచిన్ విశ్లేషించారు. సచిన్ 1996 నుంచి 2000 మధ్య రెండు విడతల్లో మొత్తం 25 టెస్టుల్లో భారత జట్టుకు నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. 2000లో దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం ఆయన కెప్టెన్సీ నుంచి తప్పుకోగా, 2007లో మరొకసారి వచ్చిన అవకాశాన్ని వద్దని చెప్పి ఆ బాధ్యతలను ధోనీకి అప్పగించేలా ప్రోత్సహించారు.





ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా సింధు, చాను

ఢిల్లీ: అగ్రశ్రేణి క్రీడాకారిణులు పీవీ సింధు, మీరాబాయి చాను సహా 10 మంది క్రీడాకారులు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ మాజీ అథ్లెట్ సుధా సింగ్ సోమవారం రాత్రి పోటీ నుంచి వైదొలగడంతో 10 పదవులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఎన్నిక అవసరం లేదని భావించిన రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ 10 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ప్రకటించారు. అంతకుముందు సోమవారం స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ కూడా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నాడు. దీంతో సింధు (బ్యాడ్మింటన్), చాను (వెయిట్ లిఫ్టింగ్), హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుశాలె (షూటింగ్), భవాని దేవి (ఫెన్సింగ్), తజిందర్‌సింగ్ తూర్ (అథ్లెటిక్స్), బాంబేలా దేవి (ఆర్చరీ), సాజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), మన్‌జీత్ సింగ్ (కయాకింగ్- కనోయింగ్)ల ఎన్నికకు మార్గం సుగమమైంది. అథ్లెట్స్ కమిషన్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో (ఒకరు పురుషుడు, మరొకరు మహిళ) ఎన్నికైన వారు ఐఓఏ కార్యవర్గ మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)లో సభ్యులుగా బాధ్యతలు చేపడతారు. ఈ కమిషన్ నుంచి ఇద్దరు సభ్యులు (ఒకరు పురుషుడు, మరొకరు మహిళ) ఓటు హక్కుతో ఐఓఏ సర్వసభ్య సమావేశంలో సభ్యులుగా ఉంటారు. అథ్లెట్స్ కమిషన్‌లోని ఈ పదవులకు త్వరలోనే ఎన్నికలు జరుగనున్నాయి.

వయసు 39.. వేగం మాత్రం చిరుతను మించి!

మైదానంలో రోహిత్ శర్మ అద్భుత విన్యాసం

ఆక్లాండ్, నవంబర్ 4 : వయసు పెరిగినా ఆటలో వేగం తగ్గలేదని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నిరూపించాడు. 39 ఏళ్ల వయసులోనూ మైదానంలో చిరుతలా కదులుతూ అద్భుతమైన ఫీల్డింగ్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచాడు. న్యూజిలాండ్‌తో ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రమాదకర బ్యాటర్ డారిల్ మిచెల్‌ను రనౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బంతిని అడ్డుకునేందుకు వేగంగా పరుగెత్తడం, వెంటనే డైవ్ చేస్తూ వికెట్ల వైపు త్రో విసరడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రోహిత్ చురుకుదనానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అతడి ఫిట్‌నెస్‌లో వచ్చిన మార్పును అభిమానులు ప్రశంసిస్తున్నారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 22వ ఓవర్‌లో ఈ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గ్లెన్ ఫిలిప్స్ ఆడిన బంతి షార్ట్ మిడ్ వికెట్ దిశగా వెళ్లింది. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ బంతిని అడ్డుకునేందుకు వేగంగా కదిలాడు. స్క్వేర్ లెగ్ వైపు పరుగెత్తి బంతిని అందుకున్న వెంటనే డైవ్ చేస్తూ వికెట్ల వైపు అద్భుతమైన త్రో విసిరాడు. బంతి నేరుగా వికెట్లను తాకకపోయినా వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ అప్రమత్తంగా వ్యవహరించాడు. రోహిత్ విసిరిన బంతిని అందుకుని వెంటనే బెయిల్స్ పడగొట్టాడు. దీంతో డారిల్ మిచెల్ 28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌటయ్యాడు. కీలక సమయంలో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్ మరింత ఒత్తిడిలో పడింది. రోహిత్ వేగానికి మిచెల్ సైతం ఆశ్చర్యపోయినట్లు కనిపించింది. గతంలో రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై పలుమార్లు విమర్శలు వచ్చాయి. వయసు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఎంతకాలం కొనసాగగలడనే ప్రశ్నలు కూడా తలెత్తాయి. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడగలడా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే గత ఏడాదిన్నర కాలంగా రోహిత్ తన శారీరక దృఢత్వంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా పర్యటన నుంచి అతడి కదలికల్లోనూ, ఫీల్డింగ్‌లోనూ చురుకుదనం కనిపిస్తోంది. తాజాగా న్యూజిలాండ్‌పై చేసిన రనౌట్ అతడి ఫిట్‌నెస్‌కు మరో ఉదాహరణగా నిలిచింది. బంతిని వెంబడించిన తీరు, డైవ్ చేసిన విధానం, వేగంగా త్రో విసిరిన సమయస్ఫూర్తి అభిమానులను ఆకట్టుకున్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టును విజేతగా నిలిపిన రోహిత్ శర్మ ఆ తర్వాత వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అతడి స్థానంలో యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. దీంతో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. అయితే కెప్టెన్సీ లేకపోయినా జట్టులో తన పాత్రను సమర్థంగా నిర్వర్తించేందుకు రోహిత్ కృషి చేస్తున్నాడు. బ్యాటింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ మెరుగైన ప్రదర్శన కనబరచడంపై దృష్టి పెట్టాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వన్డే క్రికెట్‌కే పరిమితమైన రోహిత్‌కు 2027 ప్రపంచకప్ ప్రధాన లక్ష్యంగా మారిందని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు కూడా సమష్టిగా రాణించారు. టాస్ గెలిచిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, ఆ నిర్ణయాన్ని భారత పేసర్లు సమర్థించారు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ న్యూజిలాండ్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. కివీస్ ఇన్నింగ్స్ 31 ఓవర్లు ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసింది. ఆ దశలో గ్లెన్ ఫిలిప్స్ 27 పరుగులతో, కైల్ జేమీసన్ ఒక పరుగుతో క్రీజులో ఉన్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మను మరోసారి భారత జెర్సీలో చూడాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతడి ఫిట్‌నెస్, బ్యాటింగ్ ప్రదర్శనలపై ప్రత్యేక దృష్టి నెలకొంది. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో చేసిన అద్భుత రనౌట్ ద్వారా ఫీల్డింగ్‌లోనూ తాను చురుకుగా ఉన్నానని రోహిత్ చాటాడు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపించేలా అతడి డైవ్ ఉందంటూ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు.



భారత త్రయానికి స్వర్ణం



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో రవీందర్ సింగ్, సౌరభ్ చౌదరి, అమన్‌ప్రీత్ సింగ్‌తో కూడిన భారత త్రయం పసిడిని గురిపెట్టింది. ఫైనల్‌లో ఈ త్రయం.. 1659 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని నెగ్గింది. ఇదే ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో రవీందర్ సింగ్ 559 పాయింట్లతో రజతాన్ని గెలిచాడు.



హీరోయిన్లకూ భారీ కటౌట్లు ఉండాల్సిందే!

హీరోలతో సమానంగా కథానాయికలకూ గుర్తింపు దక్కాలి: రెజీనా

చెన్నై/హైదరాబాద్, నవంబర్ 4 : సాధారణంగా చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయకులకు థియేటర్ల వద్ద అభిమానులు భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తుంటాం. అయితే అదే స్థాయిలో హీరోయిన్లకూ అభిమానుల నుంచి తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని నటి రెజీనా అభిప్రాయపడ్డారు. స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్-2' (తెలుగులో 'మహాశక్తి') సినిమా విడుదల సందర్భంగా ఆమెకు అభిమానులు 60 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేయడంపై రెజీనా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గతంలో కేవలం హీరోలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు కథానాయికలకూ విస్తరించడం చిత్ర పరిశ్రమలో వస్తున్న గొప్ప పరిణామమని పేర్కొన్నారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రెజీనా తొలిసారి ప్రతినాయిక (విలన్) పాత్రలో నటించారు. సినిమా విడుదల సందర్భంగా ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "దశాబ్దాలుగా తమిళ చిత్ర పరిశ్రమలో కేవలం అగ్ర హీరోలకే భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తున్నాం. హీరోయిన్లకు ఇటువంటి గౌరవం దక్కడం చాలా అరుదైన విషయం. నయనతారకు 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేసిన తర్వాతే 'తాయ్ కిళవి' సినిమా కోసం సీనియర్ నటి రాధిక మేడమ్‌కు కూడా కటౌట్ ఏర్పాటు చేశారని తెలిసింది. హీరోలతో సమానంగా నటీమణులకూ కటౌట్లు పెట్టడం పరిశ్రమలో సానుకూల మార్పుకు నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. ఈ సినిమా ద్వారా తన కెరీర్‌లోనే తొలిసారి ఒక భారీ కమర్షియల్ చిత్రంలో నెగెటివ్ పాత్ర పోషించే అవకాశం లభించిందని, ఇది తనకు సరికొత్త అనుభూతిని ఇచ్చిందని రెజీనా తెలిపారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం తనకు ఎంతమాత్రం నచ్చదని, అందుకే కథల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నానని చెప్పారు. తక్కువ సినిమాలు చేసినా సమాజంలో నిలిచిపోయే మంచి పాత్రలనే ఎంచుకుంటానని స్పష్టం చేశారు. నయనతార, ఊర్వశి, రెజీనా ప్రధాన పాత్రల్లో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబరు 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో నజ్రియ?

తెరపై క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో సినీప్రియుల్లో మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్నారు మలయాళ తార నజ్రియా. 'సూక్ష్మదర్శిని' సినిమా తర్వాత కథానాయికగా ఆమె థియేటర్లలో సందడి చేసి రెండేళ్లైంది. అయినప్పటికీ ఆమె ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటిస్తూ తెర వెనుక నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడామె హీరో సూర్య సరసన 'సీన్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా నజ్రియా మరో తమిళ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. 'ఎల్ఐకే' సినిమాతో ఇటీవల ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు దర్శకుడు విఘ్నేశ్ శివన్. ఇప్పుడాయన తదుపరి చిత్రంలో కథానాయిక కోసం నజ్రియాని సంప్రదించనున్నారట. ఇప్పటికే ఇందులో నటుడు అరవింద్ స్వామి, భరత్ ప్రధాన పాత్రల్లో ఖరారయ్యారని, రొమాంటిక్ కామెడీగా రూపొందనున్న ఈ సినిమాని ప్యాషన్ స్టూడియోస్, నయనతార నిర్మాణసంస్థ రౌడీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయని సన్నిహిత వర్గాల సమాచారం.



జనీకాంత్‌తో శ్రీలీల

అధికారికంగా ప్రకటించిన 'ధర్మన్' మేకర్స్!

చెన్నై/హైదరాబాద్, నవంబర్ 4 : సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ధర్మన్'. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ క్రేజీ సినిమాలో యంగ్ అండ్ ఎనర్జిటిక్ నటి శ్రీలీల కథానాయికగా నటించనున్నట్లు గత కొన్ని రోజులుగా సినీ వర్గాల్లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రచారంపై చిత్ర యూనిట్ అధికారికంగా స్పందిస్తూ ముగింపు పలికింది. శ్రీలీల ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ఒక ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఒక శక్తివంతమైన వైద్యుడి (డాక్టర్) పాత్రలో కనిపించనుండటం విశేషం. విభిన్న కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో టాలీవుడ్ హీరో రామ్ పోతినేని, సీనియర్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు అత్యంత కీలకమైన పాత్రల్లో నటించనున్నారు. భారీ తారాగణంతో ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకి రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. రజనీకాంత్, కమల్ హాసన్ నిర్మాణ సంస్థల కలయికలో శ్రీలీల, రామ్ పోతినేని వంటి యువ నటులు భాగం కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.





దియా మీర్జా దీపావళి వీడియో

బీఎంసీకి బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు!

ముంబై, నవంబర్ 4 : దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పిలుపునిస్తూ ప్రముఖ నటి దియా మీర్జా రూపొందించిన ప్రచార వీడియోను సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంపై బాంబే హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాజకీయ నేతల ఒత్తిళ్లు, అభ్యంతరాల కారణంతో తొలగించిన ఆ వీడియోను తక్షణమే తిరిగి అప్‌లోడ్ చేయాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులను ఆదేశించింది. దీపావళి పండుగ వేళ వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు బీఎంసీ ప్రత్యేకంగా ఒక వినూత్న అవగాహన ప్రచారాన్ని చేపట్టింది. అందులో భాగంగా సినీ నటీమణులు దియా మీర్జా, మాధురీ దీక్షిత్, ప్రముఖ క్రికెటర్ అజింక్య రహానే వంటి ప్రముఖులతో ప్రత్యేక ప్రచార వీడియోలను చిత్రీకరించి తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసింది. తన వీడియోలో దియా మీర్జా బాంబే హైకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ.. రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై బాణసంచా కాల్చవద్దని, పర్యావరణానికి హాని కలగకుండా దీపావళిని జరుపుకోవాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. అయితే దియా మీర్జా చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర మంత్రి నితేష్ రాణేతో పాటు పలువురు బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేవలం హిందూ పండుగల సమయంలోనే ఇటువంటి నిబంధనలు గుర్తుకొస్తాయా అంటూ విమర్శలకు దిగారు. దీంతో ఒత్తిడికి లొంగిపోయిన బీఎంసీ యాజమాన్యం తమ సోషల్ మీడియా పేజీల నుంచి ఆ వీడియోను ఉన్నపళంగా తొలగించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు బీఎంసీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజా ఆరోగ్యం, వాయు కాలుష్యంపై అవగాహన కల్పించే సాధారణ వీడియోకి మతం రంగు పులమడం తీవ్ర విచారకరమని వ్యాఖ్యానించింది. పీల్చే గాలికి, కాలుష్యానికి కులం, మతం అనే తేడాలు ఉండవని స్పష్టం చేస్తూ తొలగించిన వీడియోను పునరుద్ధరించాలని తీర్పునిచ్చింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.